ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 26.0



మినీ మహానాడును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి సారథి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు



మినీ మహానాడులో ప్రసంగిస్తున్న మంత్రి సారథి.. వేదికపై ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు బడేటి చంటి, సొంగా రోషన్ కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తదితరులు

చంద్రబాబుకు అండగా ఉందాం..

నూజివీడులో జిల్లా టీడీపీ మినీ మహానాడు

- కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట
- వైసీపీ ఘోరమైన పాలనకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారు
- రానున్న పదేళ్లూ కూటమి పాలనే..
- గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

తరలివచ్చిన టీడీపీ శ్రేణులు, అభిమానులు

నూజివీడు, మే 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధికి మనందరం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అండగా నిలుద్దామని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఆప్కాబ్ చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన నూజివీడులో గురువారం రాత్రి టీడీపీ జిల్లా మినీ మహానాడు జరిగింది.ఈ సందర్భంగా మంత్రి కొలుసు మాట్లాడుతూ.. 'దేశంలో కోటి మంది సభ్యత్వాలు ఉన్న ఏకైక రాజకీయ పార్టీ తెలుగుదేశమే. సభ్యత్వాలే కాదు కార్యకర్తల సంక్షేమానికి పార్టీ అధిష్ఠానం పెద్దపీట వేస్తోంది. కార్యకర్తల పిల్లలకు తల్లి లాంటి భువనేశ్వరిదేవి ఆధ్వర్యంలో ఎన్టీయార్ ట్రస్టు ద్వారా ఉచితంగా విద్యనందిస్తున్నాం. తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడులో మొదటిసారి పాల్గొనడం నా అదృష్టం. గత ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎలాంటి హింసకు గురయ్యారనే విషయం నేను తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన తరువాతే అర్థమైంది. టీడీపీ నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులను చేసి తిరిగి అధికారంలోకి రావాలని గత వైసీపీ చేసిన ఘోరమైన పాలనకు రాష్ట్ర ప్రజలు ఓటు అనే ఆయుధంతో గట్టిగా బుద్ధి చెప్పారు. బటన్ నొక్కడం ద్వారా ప్రజలకు డబ్బులు ఇస్తే వారు బానిసలుగా ఉంటారనే భ్రమలో గత పాలకులు వ్యవహరించారు. గత ప్రభుత్వం వివిధ పథకాల కింద లబ్ధిదారులకు రూ.60 వేల వరకు ఆర్థిక సాయం చేకూర్చగా టీడీపీ ప్రభుత్వం అన్ని పథకాలు కలిపి రూ.లక్ష ఇస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపుతూ యువత భవిష్యత్ తీర్చిదిద్దే పథకాల రూపకల్పన చేశారు. ఈ ఐదేళ్ల కాలంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. గత పాలనలో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం విడిచి పారిపోగా, టీడీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలోకి రావడానికి పారిశ్రామికవేత్తలు సుముఖంగా ఉన్నారు. రానున్న పదేళ్లు కూటమి పాలనే ఉంటుంది. కూటమిలో మన మధ్య ఏమైనా చిన్నచిన్న విభేదాలు ఉన్నా మనం కలిసి చర్చించుకుని, పరిష్కరించుకుని రాష్ట్ర భవిష్యత్ దృష్ట్యా కలిసి ఉద్యమిద్దాం' అంటూ కార్యకర్తలకు సూచించారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు విజన్‌ను ప్రస్తావిస్తూ వికాస్ భారత్ 2047, స్వర్ణాంధ్ర 2047 గురించి సవివరంగా వివరించారు. ఎమ్మెల్సీ, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీయార్ ప్రస్తుత రథసారథి చంద్రబాబునాయుడు, భవిష్యత్ నాయకుడు లోకేశ్ గురించి సవివరంగా మాట్లాడారు. 1984లో తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన చంద్రబాబు చేసిన రూపకల్పన వలనే పార్టీ పటిష్ఠంగా ఉందన్నారు. పార్టీ అధికారంలో ఉన్నా, లేకపోయినా, అవమానాలు పొందినా చంద్రబాబు ధీటుగా పార్టీ కోసం, ప్రజల కోసం నిలబడి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌కు చంద్రుని లాంటి వారని శ్లాఘించారు. సమావేశంలో ఏలూరు జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, తదితరులు మాట్లాడారు. సమావేశంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, తెలుగుదేశం సోషల్ మీడియా కన్వీనర్ దర్శిత్, దెందులూరు ఏఎంసీ చైర్మన్ రామసీత, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, తెలుగుదేశం నాయకుడు దాసరి ఆంజనేయులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్, ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

జిల్లాకు సంబంధించి ఏడు తీర్మానాలు

మినీ మహానాడులో ఏలూరు జిల్లాకు సంబంధించిన ఏడు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించి పార్టీకి పంపుతామని జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ప్రకటించారు.

- తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావుకి భారతరత్న ఇవ్వాలి.
- చింతలపూడి ఎత్తిపోతల పథకం త్వరితగతిన పూర్తి చేయాలి.
- చేపలు, రొయ్యల చెరువులకు ప్రోత్సాహకంగా విద్యుత్ రాయితీలు ఇవ్వాలి.
- కొల్లేరు కాంటూరు భూమి సమస్యను పరిష్కరించాలి.
- నూజివీడు దెందులూరులలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించాలి.
- ఆక్వా రైతుల సాగునీటి సమస్యను జలజీవన పథకం ద్వారా పరిష్కరించాలి.
- ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వాలి.

నూజివీడు నియోజకవర్గ తీర్మానాలు

నూజివీడు నియోజకవర్గం అభివృద్ధికి కొన్ని తీర్మానాలు ఆమోదించి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపారు.

- నూజివీడు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలి.
- నూజివీడులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రింగ్‌రోడ్ ఏర్పాటు చేయాలి.
- నూజివీడు పెద్ద చెరువు, మీర్జాపురం చెరువు, సగ్గురు చెరువులకు ఆధునీకరించి తాగు, సాగునీరు అందించాలి.
- నూజివీడులోని మామిడి పరిశోధన కేంద్రానికి 20 ఎకరాల భూమి మంజూరు చేయాలి.
- నూజివీడు మార్కెట్ యార్డులో మామిడి మార్కెట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలి.
- నూజివీడు పట్టణానికి అండర్ డ్రైయినేజీ ఏర్పాటు చేయాలి.

సమన్వయంతో వ్యవహరించండి..

టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు



మన కూటమిలో మిత్రుల మధ్య విభేధాలు సృష్టించడానికి వైసీపీ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. కూటమిలోని మిత్రులు అపోహలతో ఏమైనా మాట్లాడినా మెజార్టీగా ఉన్న మనం తొందర పడకుండా సమన్వయంతో వ్యవహరించి మిత్ర ధర్మాన్ని పాటిస్తూ కూటమి ఐక్యతను కాపాడుకోవాలి. మీరు తొందర పడకుండా సమస్యను పెంచకుండా సమన్వయంతో వ్యవహరించాలి. ఇది నా మాట కాదు.. చంద్రబాబు గారి ఆర్డర్. నాకు, తెనాలి నుంచి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లకు పొత్తు ధర్మంలో భాగంగా తెలుగుదేశం టికెట్లు రాలేదు. అయినా మేము పార్టీ కోసం పని చేశాం. అందుకే చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రాజేంద్రప్రసాద్ శాసన మండలిలో ఉండాలని భావించి ఆయనకు ఎమ్మెల్సీ పదవి, అలాగే నాకు కీలక ఆప్కాబ్ చైర్మన్ పదవి ఇచ్చారు. సహనంతో వ్యవహరించినప్పుడే ఆలస్యమైనా పార్టీలో అందరికీ న్యాయం జరుగుతుంది. ఈ విషయాన్ని పార్టీ కార్యకర్తలు గుర్తించుకోవాలి.



మినీ మహానాడుకు హాజరైన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు



జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం

ఉపశమనం

- ఇకపై ఆర్డీవో కార్యాలయాల్లోనే అప్పీళ్లు
- పాత పద్ధతిలోనే ఆర్‌వోఆర్ యాక్టు అమలు
- దరఖాస్తుదారులు, రైతులకు మేలు
- జిల్లాలో 200కు పైగా అప్పీళ్లకు మోక్షం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఆర్‌వోఆర్ యాక్ట్ (రికార్డ్స్ ఆఫ్ రైట్స్) కింద వివిధ కోర్టు కేసులకు సంబంధించిన అప్పీళ్లు, ఇతర అంశాలపై తిరిగి రెవెన్యూ డివిజన్‌ల అధికారు (ఆర్డీవో)లకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లా స్థాయి వరకు ప్రతీ శనివారం కోర్టుకు వచ్చి డీఆర్వో వద్ద సమస్యలు, వివాదాలను పరిష్కరించుకునే ఇబ్బందులు, వ్యయ ప్రయాసలు అటు రైతులకు, ఇటు ఫిర్యాదుదారులకు తప్పనున్నాయి. ఆర్‌వోఆర్ చట్టం అమలు బాధ్యతను 2023 డిసెంబరులో అప్పటి వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డీవోలుగా బదులుగా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ విధానంలో సమస్యలు పరిష్కారం కాకపోవడం, కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉండిపోవడంతో టీడీపీ ప్రభుత్వం పాత పద్ధతిలోనే తిరిగి ఆర్డీవోలకే వాటిని పరిష్కరించే బాధ్యతను ఇటీవల అప్పగించింది. దీంతో ఇక రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి అంశాలు స్థానిక కోర్టుల్లోనే సాగనున్నాయి. ఆర్డీవో కార్యాలయాల్లోనే వీటి అప్పీళ్లను పరిష్కరించడానికి అధికారులు చర్యలు చేపట్టనున్నారు. దీంతో జిల్లా రెవెన్యూ అధికారిపై పనిభారం తప్పనుంది.

ప్రతీ శనివారం ప్రత్యేక సమయం

ఇక మీదట రెండో శనివారం మినహా ప్రతీ శనివారం ఆర్డీవో కార్యాలయాల పరిధిలోనే ఆర్డీవో కోర్టులు నిర్వహిస్తారు. రైతుల తమ అప్పీళ్లను, ఆర్‌టీఐ చట్టం చేసిన దరఖాస్తులను ఇక్కడ పరిష్కరించుకునే వెసులుబాటును కల్పించారు. ఇలా చేయడం వల్ల జిల్లాకు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి అధిక వ్యయప్రయాసలకు కోర్చి రైతులు, ఇటు ఫిర్యాదుదారుల ఇక్కట్లకు తెర పడనుంది. ప్రధానంగా తహసీల్దార్ కార్యాలయాల్లో వెబ్‌ల్యాండ్ ద్వారా మ్యుటేషన్లు, పట్టాదారు పాస్‌పుస్తకాలను తహసీల్దార్లు మంజూరు చేస్తుంటారు. వీటిల్లో పొరపాటు, తప్పులు, భూ మార్పిడి, విస్తీర్ణం తగ్గుదల తదితర సమస్యలు తలెత్తినప్పుడు రైతులు లేదా పొలాలు దారులు, నష్టం కలిగిందని భావించిన వారంతా ఆర్‌వోఆర్ కింద ఆర్డీవోలకే అప్పీలు చేసేవారు. డీఆర్వోకు దీని బాధ్యత అప్పగించడంతో దరఖాస్తుదారులు కొన్ని నెలలుగా ఇబ్బందులు పడటంతో పాటు.. అప్పీళ్ల కేసులు పరిష్కారానికి నోచుకోలేదు. డీఆర్వోలు మారినప్పుడు ఈ పెండింగ్ ఫైళ్లను తరలించారు. ఇప్పుడు మళ్లీ ఆర్డీవోలకు ఈ దరఖాస్తులు చేరాయి. దీంతో జిల్లాలో ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డివిజన్ల పరిధిలో 200 పెండింగ్ దరఖాస్తులకు త్వరలోనే మోక్షం కల్పించే అవకాశం ఉంది.

జై భక్త హనుమాన్



జిల్లావ్యాప్తంగా గురువారం ఆంజనేయస్వామి ఆలయాలు, రామాలయాలు, పలు మందిరాల వద్ద హనుమజ్జయంతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. చిత్రంలో ప్రత్యేక పూజలందుకున్న జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి.

■ లోపలి పేజీలో..

పోలీస్ తనిఖీలు



చత్తీస్‌గఢ్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో జిల్లాలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో గురువారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలను తనిఖీ చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల నుంచి వివరాలు సేకరించారు. పోలవరం ప్రాజెక్టు వద్ద బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ప్రాజెక్టు పరిసరాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు.

కోవిడ్ కేర్!




వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం

- నేటినుంచి ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అనుమానితులకు టెస్టులు
- విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై నిఘా
- ముందస్తు జాగ్రత్తలతో భయపడనక్కరలేదని వైద్యుల భరోసా

ఏలూరు అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : వరుసగా మూడేళ్లపాటు అందరినీ గడగడలాడించిన కొవిడ్-19 వైరస్ మళ్లీ తలుపు తడుతోందా? వేలమందిని కబళించిన కొవిడ్ తన స్వరూపాన్ని మార్చుకుని కొత్త వేరియంట్ రూపంలో ప్రవేశించనుందా? సమాజంలో అన్ని రంగాలను కుదిపేసి, ఆర్థికంగా తీవ్ర నష్టాన్నే మిగిల్చిన కరోనాను ముందుగానే కట్టడి చేయడానికి వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైందా? సింగపూర్, మలేషియా, తదితర విదేశాల నుంచి రాష్ట్రానికి లేదా జిల్లాకు వచ్చే ప్రయాణికులపై ఓ కన్నేసి ఉంచడంతో పాటు, స్థానికంగా ఆసుపత్రులకు దగ్గు, జలుబు, జ్వరం, గొంతునొప్పి, ఆయాసం, వాంతులు, డయేరియా, రుచి/వాసన కోల్పోవడం, ఒళ్లు నొప్పులు, తదితర లక్షణాలతోవచ్చే రోగుల్లో ఎవరైనా అనుమానాస్పద రుగ్మతలతో ఉంటే వారి నుంచి స్వాబ్‌ను సేకరించి కొవిడ్-19 నిర్ధారణకు వీఆర్‌డీఎల్ టెస్టును తక్షణమే చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ వైద్యనిపుణులను ప్రభుత్వం ఆదేశించింది. వైరస్ నిర్ధారణ పరీక్షల కోసం ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకువచ్చి శుక్రవారం నుంచే అందుబాటులో ఉంచాలని అత్యవసర ఆదేశాల్లో పేర్కొన్నారు. ర్యాపిడ్ టెస్టు ఫలితం రావడానికి 24 గంటల వ్యవధి పడుతుంది. పరీక్షల్లో ఎవరికైనా వైరస్ నిర్ధారణ అయితే వేరియంట్, వైరల్ లోడ్‌ను పరిశీలించేందుకు స్వాబ్‌ను పుణలోని సెంట్రల్ వైరాలజీ ల్యాబ్‌కు పంపించాలని ఆదేశించారు. మూడు పొరల మాస్క్‌లు, పీపీఈ కిట్లు వైద్యసిబ్బంది కోసం సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ జిల్లాలో ముందస్తు ఏర్పాట్లపై వైద్యాధికారులతో సమీక్షించారు.

ర్యాపిడ్ కిట్లను సిద్ధం చేసిన వైద్యఆరోగ్యశాఖ

దేశవ్యాప్తంగా 2020 మార్చిలో వ్యాప్తి చెందిన కొవిడ్-19 తొలివేవ్ అందరినీ కలవరపెట్టగా, 2021లో మరోదఫా ప్రవేశించిన రెండోవేవ్ కొవిడ్ భారీగా ప్రాణనష్టంతో సమాజం యావత్తునూ అతలాకుతలం చేసింది. కొవిడ్ నియంత్రణ/నివారణకు పెద్దఎత్తున వ్యాక్సినేషన్ జరిగిన నేపథ్యంలో 2022లో థర్డ్‌వేవ్ కొవిడ్ వ్యాప్తిచెందినా పెద్దగా ప్రభావం చూపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ ఇపుడు కొవిడ్ కొత్త రూపాంతరంతో విదేశాల నుంచి వ్యాప్తి చెందుతోందన్న సమాచారంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నెల 19 నాటికి దేశంలో 257 క్రియాశీల కొవిడ్ కేసులు, రెండు మరణాలు సంభవించడంతో నష్టనివారణ చర్యలు, ముందస్తు జాగ్రత్తచర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టింది. కొత్త వేరియంట్ చిన్నపిల్లల నుంచి పెద్దవయస్సు గల వారి వరకు వ్యాప్తి చెందుతుందన్న సమాచారంతో అనుమానిత లక్షణాలున్నవారిని హోం ఐసోలేషన్/క్వారంటైన్‌లోనే ఉండాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులు సూచించారు. మరోవైపు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కొవిడ్ టెస్టింగ్ సెంటర్‌ను వినియోగంలోకి తీసుకురావడంతో పాటు, టెస్టులకు అవసరమైన కిట్లను తగినన్ని నిల్వలు ఉంచారు. అనుమానిత లక్షణాలున్న వారిని మైల్డ్, మోడరేట్‌గా విభజించి వారికి చికిత్సకోసం గతంలో మాదిరిగా స్టెరాయిడ్స్ వంటివి ఇవ్వవద్దని, నిర్దీత మందులనే వినియోగించాలని ఆదేశించారు.



ముందస్తు జాగ్రత్తలే మేలు

కొవిడ్-19కు దూరంగా ఉండటానికి ప్రజలు పాటించాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వైద్యఆరోగ్యశాఖ అడ్వయిజరీని విడుదల చేసింది. ప్రేయర్ మీటింగ్‌లు, పార్టీలు, ఫంక్షన్లలో సమూహాలుగా ఉండవద్దని హితవు పలికింది. ముఖ్యంగా రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ఎయిర్‌పోర్టుల్లో కొవిడ్ జాగ్రత్తలు విధిగా పాటించాలని అధికారులు సూచించారు. 60 ఏళ్ల వయస్సు పైబడిన వృద్ధులు, గర్భిణులు ఇంటివద్దే ఉండటం శ్రేయస్కరమని పేర్కొన్నారు. ముక్కు చీదినపుడు, దగ్గినపుడు వచ్చే తుంపర్ల నుంచి భద్రత కోసం మాస్క్‌లు ధరించాలని, బహిరంగ ప్రదేశాల్లో వున్నపుడు ముఖాన్ని చేతులతో తాకడం చేయరాదని, హైరిస్క్ ప్రాంతాల్లో మాస్క్‌లను ఎల్లప్పుడూ ధరించడం మేలని సూచించారు. అనుమానిత లక్షణాలున్నవారు కరోనా నిర్ధారణ, చికిత్స కోసం సమీప కొవిడ్ ఆసుపత్రులను సందర్శించాలని కోరారు. దీనిపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఐడీఎస్‌పీ విభాగం వైద్యాధికారులు మాట్లాడుతూ 'రాష్ట్రంలో ఇప్పటివరకు కొవిడ్-19 పాజిటివ్ కేసు ఒక్కటీ నమోదుకాలేదు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ముంద స్తు ఏర్పాట్లను చేస్తున్నాం. తాజాగా వ్యాప్తిచెందుతోన్న కొవిడ్ వేరియంట్ 3-4రోజుల్లో దానంతటదే తగ్గిపోతుంది. ఎవరూ ఆందోళనకు గురికావద్దు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు వైద్యఆరోగ్యశాఖ సమాయత్తమైంది ' అని వివరించారు.

నేడు మంత్రి అచ్చెన్నాయుడు ఏలూరు రాక

ఏలూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్థకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ఉదయం 11 గంటలకు ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకుంటారు. కలెక్టరేట్‌లో 11 గంటల నుంచి 1:30 గంటల వరకు ఉద్యానవన ప్రత్యేక కార్యదర్శి, జిల్లా కలెక్టర్, కోకో రైతులు, ప్రజా ప్రతినిధులు, కోకో ప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం ఏలూరు నుంచి బయల్దేరి విజయవాడ వెళ్తారు.

సింగిల్ విండో కింద పరిశ్రమల స్థాపనకు చర్యలు : కలెక్టర్

ఏలూరు, మే 22(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సింగిల్ విండో కింద పరిశ్రమల స్థాపన, ఇతర ప్రోత్సాహకాల మంజూరులో ప్రతీ అంశాన్ని క్షుణంగా పరిశీలించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఆమె మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తల దరఖాస్తులను పరిశీలించి నిబంధనల మేరకు సింగిల్ విండో ద్వారా అన్నీ అనుమతులను ఇవ్వాలన్నారు. దీని కింద ఇప్పటి వరకు అందిన 84 దరఖాస్తుల్లో ఇప్పటికే 51 దరఖాస్తులు ఆమోదం పొందాయన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం పి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్ డి.నీలాద్రి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.ముక్కంటి, జిల్లా అగ్నిమాపకాధికారి సీహెచ్ రత్నబాబు, ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ భాను ప్రతాప్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్ త్రినాథరావులు పాల్గొన్నారు.

యోగా ఆవశ్యతను తెలిపేందుకు నిర్దేశించిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి సంబంధిత అధికారులను సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంపై జిల్లామండల స్థాయి అధికారులతో కలెక్టర్ గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

కొనసాగిన సప్లిమెంటరీ పరీక్షలు

ఏలూరు అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన గణితం పరీక్షకు జిల్లాలో 4,799 మంది బాలబాలికలు దరఖాస్తు చేసుకోగా 3,483 మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య ఇంటర్మీడియట్ ఫిజిక్స్ పరీక్షకు 142 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా 122 మంది, పొలిటికల్ సైన్సు పరీక్షకు 133 మందికి 110 మంది, పదో తరగతి మ్యాథ్స్ పరీక్షకు 364 మందికి 308 మంది హాజరయ్యారని వివరించారు.

ఈఏపీ సెట్ పరీక్షకు 35 మంది గైర్హాజరు

ఈఏపీ సెట్‌లో భాగంగా గురువారం జరిగిన ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు ఏలూరులోని సిద్ధార్థ క్వెస్ట్ పరీక్ష కేంద్రానికి ఉదయం, మధ్యాహ్నం షిఫ్టుల్లో 153, 152 మంది విద్యార్థులు, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రానికి 148, 143 మంది, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి 171, 174 మంది హాజరయ్యారు. మొత్తంమీద 35 మంది గైర్హాజరయ్యారు.


అటవీ, వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

అభయారణ్య సరిహద్దుల నిర్ధారణపై సమావేశం

ఏలూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాపికొండల అభయారణ్యం సరిహద్దుల నిర్ధారణపై కలెక్టర్ వెట్రిసెల్వి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. 1012.86 కిలోమీటర్ల అభయారణ్యం విస్తరించింది. దీన్ని ఎకో సెన్సిటివ్ జోన్‌గా సరిహద్దులను నిర్ణయిం చనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల విభజన నేపథ్యంలో ఇప్పుడు సరిహద్దుల నిర్ధారణ చేసుకోవాల్సిన అవశ్యకత ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి శుభం, పోలవరం ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ రామచంద్రారెడ్డి, జలవనరుల శాఖ, పర్యావరణ, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్, మైనింగ్, పర్యాటకశాఖ అధికారులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో జేసీ ఆకస్మిక తనిఖీలు

ద్వారకాతిరుమల, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన రేషన్‌కార్డు లబ్ధిదారులను త్వరితగతిన గుర్తించాలని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ద్వారకాతిరుమల, జి.కొత్తపల్లి సచివాలయాలను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కొత్తగా వచ్చిన దరఖాస్తుల తీరును పరిశీలించారు. రేషన్ కార్డులలో అర్హులైన వారి చేర్పులు, అనర్హుల తొలగింపు ప్రక్రియ వేగవంతం చేసి జాబితాలను తయారు చేయాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. అనంతరం జి.కొత్తపల్లిలో సర్వే నంబర్ 299లో సుమారు 15 ఎకరాల విస్తీర్ణం లోని స్థలంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 700 మెగావోల్టుల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జేవీ సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న జేసీ ధాత్రిరెడ్డి



మద్ది క్షేత్రంలో లక్ష తమలపాకుల పూజ

జంగారెడ్డిగూడెం, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి సందర్భంగా మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు వేకువ జాము నుంచి స్వామివారికి ప్రభాత సేవ, నిత్యార్చన, కైంకర్యములను నిర్వహించారు. ఆలయమంతా పూలతో అందంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. శుక్రవారం ప్రభాత సేవ, నిత్యార్చన, నిత్య హోమం, బలి హరణ,అనంతరం శ్రీ సువర్చలా హనుమద్ కల్యాణం నిర్వహిస్తామని ఈవో ఆర్వీ చందన తెలిపారు. సాయంత్రం గురవాయిగూడెం, చక్రదేవరపల్లి గ్రామాలలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

అప్పనవీడు అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పెదపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి) : హనుమజ్జయంతి వేడుకలు పెదపాడు మండలంలో ఘనంగా జరిగాయి. పెదపాడు మండలం అప్పనవీడు అభయాంజనేయస్వామి 24వ హనుమజ్జయంతి వేడుకలు ముగింపు సందర్భంగా ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, బడేటి చంటి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీలు స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామోత్సవం అనంతరం స్వామివారి 25, 18 కేజీల లడ్డూ వేలంపాట నిర్వహించారు. నాయుడుగూడెం సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే చింతమనేని భార్య రాధారాణి పూజలు నిర్వహించారు.


అభయాంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే బడేటి చంటి, జడ్పీ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ

అభయాంజనేయస్వామికి మూడు కేజీల వెండి కవచం

నరసాపురం టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): నరసాపురం పట్టణంలోని చినమామిడిపల్లి నాగారమ్మ ఆలయ సమీపంలో ఉన్న అభయ అంజనేయస్వామికి గురువారం మూడు కేజీల వెండి తొడుగు ఆభరణాలను ఏపీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం దంపతులు స్వామివారికి బహూకరించారు. హనుమాన్ జయంతి సందర్భంగా పూజలు నిర్వహించారు. పాలూరి ప్రసాద్, గునిశెట్టి సత్యనారాయణ, పాలూరి బాబ్జీ, కలిగినీడి కుమార్, రమేష్, గునిశెట్టి శ్రీనివాస్, పాలూరి శ్రీను, బళ్ళ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.


స్వామికి వెండి కవచం బహూకరిస్తున్న కలిగినీడి చిదంబరం


వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

రేపు ఏలూరులో ఫ్యాషన్‌షో ఫైనల్స్

ఏలూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, యువతి, యువకుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఎన్‌జె ఫ్యాషన్ పేరుతో ఫ్యాషన్‌షో నిర్వహించామని దీనికి సంబంధించి ఫైనల్స్ ఈనెల 24వ తేదీన ఏలూరు క్రాంతి కల్యాణ మండపంలో నిర్వహిస్తునట్లు నిర్వాహకులు నేహ, జాస్మిన్ తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు అందంగా అలంకరించుకోవడమే కాకుండా నలుగురిలో ప్రత్యేకంగా కనిపించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. తమ సౌందర్యాన్ని, మేధోశక్తిని ప్రదర్శించడానికి అందాల పోటీల పై ఆసక్తిని కనబరుస్తున్నారని ఈ క్రమంలో ఇటీవల ఫ్యాషన్‌షోకి సంబంధించి సెలక్షన్స్ నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 40 మంది యువతీ యువకులు, పెళ్లైన మహిళలు పాల్గొన్నారు. 24వ తేదీన ఫైనల్స్ నిర్వహించి విజేతను ప్రకటిస్తామన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి నగర ప్రముఖులు హజరుకానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా యువతి యువకులు క్యాట్ వాక్‌తో ఆకట్టుకున్నారు. సమావేశంలో రాజ్‌కుమార్, వంశీ మాధురి, తదితరులు పాల్గొన్నారు.

బదిలీల జాతర

ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

ఐదేళ్లు సర్వీసు దాటిన వారి జాబితా తయారు చేస్తున్న వివిధ ప్రభుత్వ శాఖలు

సిఫార్సు లేఖల కోసం పైరవీల జోరు

ఏలూరు సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులను బదిలీ చేయటానికి ఈనెల 16న రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈనెల 24వ తేదీలోగా ఈ బదిలీ ప్రక్రియను పూర్తిచేసి జూన్ 2వ తేదీన ఈ బదిలీలకు సంబంధించి తుది జాబితా విడుదల చేయనున్నారు. బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు కూడా విడుదల చేసింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఒకేచోట ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకుంటే వారికి తప్పనిసరిగా బదిలీ చేయాలని, జీరో సర్వీసు నిబంధన ఉండ టంతో రిక్వస్ట్ బదిలీలు, పరిపాలనా పరంగా బదిలీలు చేయవచ్చు. దీనికి సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో బదిలీల కస రత్తు ప్రారంభించారు. తమకు కావాల్సిన స్థానాలు కోరుకునే వారు పైరవీలు చేయడం ప్రారంభించారు. ప్రజా ప్రతినిధుల సిఫార్సు లెటర్స్ కోసం ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీల చుట్టూ ఉద్యోగస్తులు తిరగడం ప్రారంభించారు. వివిధ యూని యన్లలో పనిచేసే ఆఫీస్ బేరర్లకు మాత్రం ఈ బదిలీలలో మినహాయింపు ఉంటుందని చెబుతున్నారు.

కార్యాలయాల్లో హడావుడి

జిల్లా పరిషత్‌కు సంబంధించి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో ఈ బదిలీలు జరగనున్నాయి. జిల్లా పరిషత్ విషయాని కొస్తే 5 ఏళ్ల దాటిన వారు ఏవోలు 9 మంది, సీనియర్ అసిస్టెంట్లు 17 మంది, జూనియర్ అసిస్టెంట్లు 36, రికార్డు అసిస్టెంట్లు 7, టైపిస్టులు 7, ల్యాబ్ అసిస్టెంట్లు 4, ఆఫీస్ సబార్డినేట్స్ ఆరుగురు ఉన్నారు. వీరిలో ఆఫీసు బేరర్లకు బదిలీలలో మినహాయింపు ఉంటుంది. ఇవిగాక జీరో సర్వీసు అమలులో ఉండటంతో చాలామంది సిఫార్సుల ద్వారా రిక్వస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకోనున్నారు. ఇలా జిల్లా పంచాయతీ శాఖ కూడా బదిలీల కసరత్తు ప్రారంభించింది. క్యాడర్ వారీగా సమాచారాన్ని సేకరించే పనిలో నిమగ్నమైంది. పంచాయతీ కార్యదర్శులు, డీఎల్‌పీవో, డీపీవో కార్యాలయాల్లో పనిచేసే వారిలో ఐదేళ్ళు సర్వీసు దాటిన వారికి బదిలీలు అయ్యే ఆవకాశాలున్నాయి. పంచా యతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్ , డ్వామా, డీఆర్‌డీఏ ఇలా జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఆయా కార్యాలయాల్లో హడావుడి మొదలైంది.



జూనియర్ కళాశాలల లెక్చరర్ల బదిలీలకు షెడ్యూలు విడుదల

ఏలూరు అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ విద్యను బోధించే ప్రభుత్వ జూనియర్ కళాశాలల బోధన, బోధనేతర సిబ్బంది సాధారణ బదిలీలకు గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. కొత్తజిల్లాల ప్రాతిపదికన బదిలీలు జరుగుతాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి శేఖర్‌బాబు వెల్లడించారు. జిల్లాలో 19 ప్రభుత్వ జూనియర్ కళాశాల లుండగా, 52 మంది రెగ్యులర్ లెక్చరర్లు, 43 మంది నాన్-టీచింగ్ స్టాఫ్ పనిచేస్తున్నారు. వీరిలో రెండేళ్ల సర్వీసు పూర్తిచేసినవారు బదిలీకి అర్హులు. అలాగే ఒకే కళాశాలలో 5 సంత్సరాలు పనిచేసినవారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గురువారమే ప్రారంభం కాగా జూన్ 8 నాటికి బదిలీల ప్రక్రియ పూర్తయ్యేలా షెడ్యూలు విడుదల చేశారు.

శ్రీవారి గోవుల దత్తత

ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహం

రైతులకు 7 వేల పైబడి గోవుల దత్తత

దేవస్థానం ఇచ్చిన ఆవులను పెంచి పోషిస్తున్న రైతులు



ద్వారకాతిరుమల, మే 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి శేషాచలంపై ఉన్న గోసంరక్షణ శాలలోని కొన్ని రకాల గోవులను రైతులకు దత్తతనిస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని దేవస్థానం ప్రోత్సహిస్తోంది. మొక్కుబడుల రూపేణా దాతలు సమర్పించే గోవుల సంఖ్య పెరుగుతుండటంతో దేవస్థానం 1987లో కొండపై గోశాలను ప్రారంభించారు. 2007లో దానిని గోసంరక్షణ ట్రస్టుగా రూపొందించారు. అదే ఏడాది గోదత్తత కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీవారి మొక్కుబడులు సమర్పించే దిశగా పలువురు భక్తులు గోవులను అందిస్తుంటారు. ఈ క్రమంలో గోసంతతి పెరిగింది. ఇందులో గోవుల నుంచి వచ్చే పాలను ప్రధాన దేవాలయంతో పాటు ఉప, దత్తత దేవాలయాల్లో స్వామివారి సేవలతో పాటు, ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదానంలోను, ప్రసాదంలోను వినియోగిస్తారు. పాలివ్వని, చూడికట్టని గోవులు పెరుగుతుండటంతో దేవస్థానం ఓ ఆలోచన చేసింది. ఇటీవల కాలంలో ప్రకృతి వ్యవసాయం పెరిగింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించి రసాయనిక ఎరువులకు చెక్‌పెట్టే విధంగా ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రకృతి సేద్యంను ప్రోత్సహిస్తుండటంతో రైతులు ఆ వైపు దృష్టి సారిస్తున్నారు.



ప్రకృతి వ్యవసాయంలో ముఖ్యంగా గోఆధారిత పదార్థాలను వినియోగించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా గోమూత్రం, ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో గోశాలలో పాలివ్వని, చూడికట్టని ఆవులను ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అందజేస్తే వాటికి పోషణ అందడంతో పాటు ఇటు రైతు పొలానికి అవసరమయ్యే ఎరువు లభ్యమవుతుందన్న ఆలోచన చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని శేషాచలంపై ఉన్న శ్రీవారి గోసంరక్షణ శాలలో ఉన్న కొన్ని జాతుల గోవులను, గిత్తలను ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులకు దత్తతనిచ్చే కార్యక్రమం తలపెట్టింది. ఇప్పటి వరకూ దేవస్థానం వివిధ ప్రాంతాలకు చెందిన రైతులకు 7,342 వరకూ గోవులను దత్తతకు ఇచ్చింది.

రెండు, నాల్గవ శనివారం దత్తత

చినవెంకన్న గోసంరక్షణ శాలలో ప్రస్తుతం 343 వరకూ వివిద జాతుల గోవులు, గిత్తలు ఉన్నాయి. ఇందులో పుంగనూరు, కపిల, కాంక్రీట్, గిరి, ఒంగోలు, నిమారి, మైసూర్ జాతుల మినహా దేశవాళీ, జెర్సీ జాతులను రైతులకు దత్తత ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. ఇందులో భాగంగా గోశాలలో పాలిచ్చే ఆవులను ఏ గ్రేడ్‌గాను, చూడికట్టిన వాటిని బిగ్రేడ్‌గాను, అలాగే పాలివ్వని చూడికట్టని వాటిని సి గ్రేడ్‌గా విభజించారు. సి-గ్రేడ్ ఆవులను పకృతి వ్యవసాయంచేసే రైతుకు అందచేస్తున్నట్లు వివరించారు. ప్రతీ నెలలో రెండు, నాల్గవ శనివారం ఇటువంటి గోవులను దత్తత ఇచ్చే కార్యక్రమం తలపెట్టినట్లు పేర్కొన్నారు. ఈనెల 24న ప్రస్తుతం దత్తతకు ఇచ్చే రకానికి చెందిన గోవులు 40 వరకూ ఉన్నట్లు చెప్పారు.

గోదత్తత స్వీకారానికి అర్హతలివే

దేశంలో లంప్‌స్కిన్ వ్యాది రావడంతో గోవులను దత్తత ఇచ్చే కార్యక్రమాన్ని కొన్నాళ్లుగా నిలిపి వేశారు. ఇటీవల గోఆధారిత వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే ఇచ్చేలా నిర్ణయించారు. ఇందు నిమిత్తం రైతులు తమ పొలానికి సంబంధించి పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీలు, 100 రూపాయల స్టాంప్ పేపర్, ఆధార్‌కార్డు, నివాసధ్రువీకరణ పత్రం జిరాక్స్, తమ కాంటాక్ట్ నంబర్లతో ఆలయ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.ఇలా నమోదు చేసుకున్న వారికి మాత్రమే గోదత్తత ఇస్తామన్నారు. వాటిని రైతులు పెంచి పోషించాలే గానీ విక్రయించకూడదు. పోషించలేని పక్షంలో తిరిగి దేవస్థానానికి ఇచ్చేయాల్సి ఉంటుంది. దత్తత తీసుకున్న రైతులు ఆవులను సంరక్షిస్తూ వాటి ద్వారా వచ్చే గోమూత్రం, పేడ తదితరాలతో ప్రకృతి వ్యవసాయం చేసి నాణ్యమైన ఉత్పత్తులను అందించాలని అధికారులు చెబుతున్నారు. ప్రతీ మూడు నెలలకి ఓసారి వాటి పరిస్థితి ఎలా ఉంది అన్న అంశంపై వాట్సాప్ ద్వారా దత్తత తీసుకున్న రైతు నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారు.


ఇదో మహత్తర కార్యక్రమం



స్వామివారి దేవస్థానంలో ఇదో మహత్తర కార్యక్రమం. గోశాలలో ఉన్న గోవుల్లో పాలివ్వనివి చూడికట్టని వాటిని ఎలా వినియోగించాలి అన్న ఆలోచనే ఈ గోదత్తత కార్యక్రమం. ఇది రైతులకు వరం. గోశాలలో ఉన్న సి గ్రేడ్ ఆవులు రైతుల సేద్యానికి ఉపయోగపడుతున్నాయి. ఎందరో రైతులు వాటిని సాకుతూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. అలాగే కొందరు గోమాతలను పెంచి పోషిస్తూ ఆనందాన్ని పొందుతున్నారు.

ఎన్వీ సత్యన్నారాయణమూర్తి, ఈవో, ద్వారకాతిరుమల

సైబర్ దోపిడీ



ఏదైనా క్షణాల్లో అయిపోవాలి. ఆలోచించే ఓపిక, నిరీక్షించే సమయం గాని లేని పరిస్థితుల్లో ఉన్నాం. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధితో అన్ని కూడా క్షణాల్లోనే జరిగిపోవాలనే ఆలోచనకు అలవాటుపడి పోయారు. ఇది గమనించిన సైబర్ నేరగాళ్లు ఇట్టే వలవేసి మోసాలకు తెగబడుతున్నారు. క్షణాల్లోనే లక్షలాది రూపాయలను కొట్టేస్తున్నారు. మోసపోయామని తెలుసుకుని బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. చిన్న చిన్న సొమ్ములు పోగొట్టుకున్న వారు ఎవరికి చెప్పుకోలేక ఫిర్యాదు కూడా చేయడం లేదు.

డిజిటల్ అరెస్టు అంటూ బెదిరింపులు

ఆపై ఆన్‌లైన్‌లో సొమ్ములు స్వాహా


నేరగాళ్ల వలలో విద్యావంతులు

తక్కువ ధరకే వస్తువులు అంటూ ఆన్‌లైన్‌లో ఎర

మోసపోతున్న బాధితులు

ఏలూరు క్రైం, మే 22 (ఆంధ్రజ్యోతి) : గతంలో కీప్యాడ్ ఫోన్లకు లాటరీ తగిలిందని మెస్సేజ్‌లు వచ్చేవి. ఆ సొమ్ము పొందాలంటే ఖచ్చితంగా ఇన్‌కమ్ టాక్స్ చెల్లిం చాలంటూ బ్యాంక్ అకౌంట్ నంబర్లు ఇచ్చి సొమ్ములను వేసుకుని మోసం చేసేవారు. తరువాత యాండ్రాయిడ్ ఫోన్ వచ్చిన తరువాత తాము బ్యాంక్ అధికారులమంటూ ఫోన్ చేసి ఓటీపీ నంబర్లు తెలుసుకుని సొమ్ములను తస్కరిస్తున్నారు. ముఖ్యంగా మన ఫోన్‌లోని సమాచారాన్ని తస్కరించడానికి సైబర్ నేరగాళ్ళు ఏపీకే ఫైల్స్ పంపిస్తున్నారు. అవి కూడా ఎదుటివారికి ఆశ కల్పించేలాగ, ఆకర్షించేలాగ పెడుతున్నారు. ముఖ్యంగా ఆధార్ ఏపీకే, ఎస్‌బీఐ ఏపీకే , పీఎం కిసాన్ ఏపీకే, యునియన్స్ బ్యాంక్ వంటి పేర్లతో ఈ ఫైల్స్ పంపిస్తున్నారు. ఏపీకే అంటే యాండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ ఫైల్స్ ఫార్మేట్. ఇది యాండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌లో ఉపయోగించే అప్లికేషన్ల కోసం ఒక ఫైల్ ఫార్మేట్. ఇది ఒక యాప్‌కు కావాల్సిన మొత్తం డేటాను కలిగి ఉంటుంది. ఇలాంటి ఫైల్స్ మన ఫోన్‌లో వచ్చినప్పుడు ఓపెన్ చేస్తే మన ఫోన్‌లో ఉన్న డేటా అంతా ఏపీకె ఫైల్స్ ద్వారా అవతలి వ్యక్తి తస్కరిస్తాడు. పూర్తిగా మన ఫోన్ అతని కంట్రోల్‌లోకి వెళ్లిపోతుంది.

యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో కూడా అరచేతి నాడీ మండలంతో మీ జాతకం తెలుసుకోవచ్చునని వెంటనే ఈ క్రింద ఉన్న లింకును ఓపెన్ చేయమని అప్పుడు మీ జ్యోతిష్యం తెలుస్తుందని ఇస్తారు. మీరు ఏ రాశి వారో మీ భవిష్యత్తు ఎలా ఉందో ఇప్పుడే తెలుసుకోవచ్చునంటూ ఆశ కల్పిస్తారు. ఇలాంటి లింకులను ఓపెన్ చేయగానే క్షణాల్లోనే మన ఫోన్ డేటా అవతలి వ్యక్తులు తస్కరిస్తున్నారు. ఇలాంటి డేటా తస్కరించిన వ్యక్తులు మన ఆధార్‌కార్డు, మన వివరాలు, రోజు మనతో ఎవరెవరు మాట్లాడుతున్నారో వంటి వివరాలతో పాటు మన కాంటాక్టు లిస్టును కూడా తెలుసుకుని నేరుగా సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తున్నారు. మీ ఆధార్ కార్డుపై పార్శిల్ విదేశాలకు వెళ్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్లకు చిక్కిందని దానిలో డ్రగ్స్ ఉన్నాయంటూ సీబీఐ అధికారులు ఇప్పుడే మాట్లాడతారంటూ నేరుగా వీడియోకాల్ చేసి యూనిఫామ్‌లో ఉన్న పోలీసు అధికారి లైన్‌లోకి వస్తారు. ఎఫ్ఐఆర్‌ను కూడా ఎప్పటికప్పుడు వాట్సప్‌లో పంపిస్తున్నారు. బెంగుళూరు, ఢిల్లీ ఇతర ప్రాంతాల చిరునామాతో ఉంటుంది. మరికొంత మందికి వారి పిల్లలు వివిధ రాష్ట్రాల్లో చదువుకుంటుండగా ఇక్కడ మీ అబ్బాయో, అమ్మాయో డ్రగ్స్ కేసులో పట్టుబడ్డారని వెంటనే సొమ్ములు చెల్లిస్తే కేసు లేకుండా చేస్తామని క్షణాల్లో లక్షలాది రూపాయలు తస్కరిస్తున్నారు. ఈ రకంగా బాధితులు జిల్లాలో అనేక మంది ఉన్నారు. ముఖ్యంగా ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లోనే ఎక్కువ మంది బాధితులు ఉన్నారు. విద్యా వంతులే ఇలాంటి వారి మోసగాళ్ల వలలో పడి లక్షలాది రూపాయలను పోగొట్టుకుని లబోదిబోమంటున్నారు.


INFORMATION REPORT
In respect of Article / Fraudulent Report in Bengaluru
SO No: 430 / 2025 Karnataka Police

PS: Crime Branch,Karnataka FIR No:BK354A/0525 Date :13/05/2025

1. Complainant's Details
RP Aloysius, (Reporting on behalf of 17 complainants regarding illegal advertising and harassing text). Door no. 27/2, Ashoka Nagar , 40 Feet Rd, near Church - 2nd Phase, 1st Stage, 5th Cross, Bangalore south, Karnataka,560050, India, ND-60 rpaloysius@gmail.com

2. Occurrence Details
(a) Date And Time of Report : Date: 11/05/2025 Time:16:48
(b)Date And Time of Occurred, If Known : Date: 02/06/2024 Time:19:50
(c)Mobile Number Application Location : Shop No. 771, Vishwa Vijaya, 40 Feet Rd, near RR Nagar Depot-2nd Phase, 5th Stage, Rajarajeshwari Nagar, Bengaluru, Karnataka 560098, India

దుగ్గిరాలకు చెందిన ఒక టీచర్‌కు బెంగుళూరు నుంచి పంపిన ఎఫ్ఐఆర్ కాపీ

నకిలీ ఇ-కామర్స్ వెబ్‌సైట్లతో జాగ్రత్త

ఆన్‌లైన్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని, బంగారం తక్కువ ధరకు పొందవచ్చునని ఆకర్షణీయంగా ప్రకటన చేస్తూ మరికొంత మంది పెట్టుబడి పెట్టారంటూ వారి ఫోటోలను కూడా గ్రూపుల్లో పెడుతూ మోసాలకు తెగబడుతు న్నారు. ప్రస్తుత కాలంలో ఆన్‌లైన్ షాపింగ్ ఎక్కువ కావడంతో నకిలీ ఇ-కామర్స్ వెబ్‌సైట్లు కూడా వచ్చేశాయి. ఖరీదైన వస్తువులు 80 శాతం ఆఫర్ అంటూ సొమ్ములను కట్టించుకుని ఆపై ఆసైట్లు అదృశ్యం అవుతున్నాయి. ముఖ్యంగా మహిళలకు ఆకర్షణీయమైన చీరలు ఇలాంటి సోషల్ మీడియాలో ప్రకటనలు చేస్తూ ఆకర్షణకు గురైన మహిళలు ఆ చీరలకు సొమ్ములు కట్టి మోసపోతున్న వారు జిల్లాలో ఎంతో మంది ఉన్నారు. ఇంటిలో చెప్పుకోలేక, పోలీస్ కేసు పెట్టలేత తమలో తామే బాధపడుతున్నారు. ఇటీవల ఏలూరు సమీపంలోని దుగ్గిరాలకు చెందిన ఒక ఉపాధ్యాయుడికి అకస్మాత్తుగా బెంగుళూరు నుంచి ఒక వ్యక్తి ఫోన్ చేసి ఉపాధ్యాయుడి ఆధార్‌కార్డుతో పొందిన ఫోన్ నెంబర్ ద్వారా ఇల్లీగల్ అడ్వర్‌టైజ్‌మెంట్ అండ్ హెరాస్‌మెంట్ చేస్తున్నారని కేసు నమోదు చేశామంటూ భయబ్రాంతులకు గురి చేశారు. అంతేకాకుండా ఆ ఉపాధ్యాయుడి పేరుపైన, ఫోన్ నెంబర్‌పైన క్రైం బ్రాంచ్ కర్నాటక స్టేట్‌లో కేసు నమోదు చేసినట్లుగా హడావుడిగా ఎఫ్ఐఆర్ నంబర్ కూడా వాట్సప్‌లో పెట్టారు. అయితే ఆ ఉపాధ్యాయుడు సమయస్ఫూర్తితో స్పందించి క్షణాల్లోనే ఆ నేరగాళ్ల ఫోన్ నంబర్లపై ఏలూరులో ఉన్న సైబర్ క్రైమ్ ఫోన్ నంబర్లకు ఫిర్యాదు చేశారు.

ఎందరో బాధితులు

- ఏలూరు గవరవరానికి చెందిన ఒక ఉద్యోగికి ఆన్‌లైన్ ద్వారా ఒకమహిళ పరిచయం అయింది. బిట్ కాయిన్స్ ద్వారా ఎక్కువ సంపాదించవచ్చునంటూ వాట్సప్ గ్రూపులో చేర్చారు. ఆ తరు వాత పరిచయం పెంచుకుని ఏకంగా 49 లక్షల 94 వేల 411 రూపాయలు ఈ ఏడాది ఏప్రిల్ 6వ తేదీ నాటికి ఆ ఉద్యోగి అకౌంట్ నుంచి దఫదఫాలుగా కొట్టేశారు. దీంతో ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.
- ఏలూరు శ్రీరామ్‌నగర్‌కు చెందిన ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ముంబై ట్రాయి (టెలిఫోన్ రెగ్యులేటరీ అథార్టీ ఆఫ్ ఇండియా) నుంచి కాల్ చేస్తున్నామని మీ నెంబర్‌పై సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారని వారు మాట్లాడతారని చెప్పిన మరుక్షణమే వాట్సప్ కాల్‌లో పోలీసు యూనిఫాం ధరించిన అధికారి భయ భ్రాంతులకు గురిచేసి అప్పటికప్పుడే 9 లక్షలు అకౌంట్లో వేయించుకున్నారు. బాధితుడు తాను మోస పోయానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- ఏలూరులోని విద్యానగర్‌కు చెందిన ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ముంబై నుంచి కాల్ చేస్తున్నామంటూ ఫోన్ రావడంతో ఆమె లిఫ్టు చేయగా పెడెక్స్ కొరియర్ పార్శిల్‌లో మీ పేరుపైన కొకైన్ ఉందని సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారంటూ డిజిటల్ అరెస్టు చేస్తున్నామని భయబ్రాంతులకు గురిచేసి మూడు రోజుల పాటు ఆమెకు ఫోన్‌లో నరకం చూపించి 25 లక్షల రూపాయలు దఫఫాలుగా బదిలీ చేయించుకున్నారు. బాధితురాలు ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఫోన్ల ద్వారా అరెస్టులు చేయలేరు



సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ అనేక మోసాలకు పాల్పడు తున్నారు. బ్యాంక్ అధికారుల మని, క్రెడిట్‌కార్డులు అప్‌డేట్ చేయాలని, ఈకెవైసీ చేయాలని, వివిధ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేశారని వాటి వివరాలు తీసుకుంటున్నామంటూ ఫోన్లు చేసి వ్యక్తిగత సమాచారాన్ని, ఓటీపీ నెంబర్లను తీసుకుంటారు. ఇలా ఏ అధికారి కూడా ఫోన్లలో వివరాలు తీసుకోరు. ఇలాంటి కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఆన్‌లైన్‌లో పెట్టుబడులకు ఎక్కువ సొమ్ములు వస్తాయని ఆశ చూపి పెట్టుబడులు పెట్టమని అడిగేవారి మాటలు నమ్మవద్దు. తక్కువ ధరకు వస్తువులు వస్తాయని వచ్చే ప్రకటనలను నమ్మవద్దు. ఏపీకే ఫైల్స్ పట్ల అజ్ఞాత వ్యక్తులు పంపించే మెస్సేజ్‌లు, లింకుల పట్ల అప్రమత్తంగా ఉండండి. వాటిని ఓపెన్ చేయవద్దు. ఎవరైనా సైబర్ నేరానికి గురై మోసపోతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి. డిజిటల్ అరెస్టులు అంటూ సీబీఐ, ఈడీ పోలీసు అధికారుల మని చెప్పి వచ్చే కాల్స్ పట్ల భయ పడవద్దు. వారు ఖచ్చితంగా సైబర్ నేరగాళ్లే.. ఇలాంటి వాటిపై సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా ఏలూరులో ఉన్న సైబర్ సెల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి.

- కేపీఎస్ కిషోర్, ఎస్పీ, ఏలూరు జిల్లా



భవిష్యత్ పర్యాటక రంగానిదే..

రాష్ట్ర పర్యాటక, గృహ నిర్మాణ శాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్

కాళ్ళ, మే 22 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక భవిష్యత్ అంతా పర్యాటక రంగానిదేనని ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్ అన్నారు. కాళ్ళ మండలం కోపల్లె మంతెన హెరిటేజ్‌లో గురువారం రాష్ట్ర పర్యాటక, గృహ నిర్మాణ శాఖల ప్రత్యేక ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పర్యాటకులను ఆకర్షించేలా టెంపుల్, ఏకో, అడ్వెంచర్, వెల్‌నెస్, అగ్రిటూరిజంలను కలుపుతూ ప్రభుత్వం టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రాజెక్టులను రూపొందిస్తున్నామని, దీనిలో భాగంగా కృష్ణా నదిపై నీటిలో తేలియాడే రెస్టారెంట్ (ఫ్లోటింగు రెస్టారెంట్), విజయవాడలో బెర్మ్ పార్క్, కోనసీమ బ్యాక్ వాటర్‌లో సింగిల్ బెడ్‌రూమ్ లగ్జరీ హౌస్ బోట్లు ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు. పోలవరం నుంచి పట్టిసీమ మధ్య తీగల వంతెన, విజయవాడలోని భవానీ ద్వీపంలో థీమ్ పార్క్, వాటర్ పార్క్ లాంటివి ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రూ. 50 కోట్లకంటే తక్కువ పెట్టుబడులు పెట్టే సంస్థ (ఎంఎస్‌ఎంఇ)లకు బిడ్డింగు ప్రాతిపదికన భూమి కేటాయింపులు చేస్తామన్నారు. ఈ విధంగా పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం పది నెలల వ్యవధిలో కీలక నిర్ణయాలు తీసుకుందన్నారు. ఈ సమావేశంలో జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, టూరిజం సహాయ సంచాలకులు ఏ.లాజ్ వంతి నాయుడు, మేనేజర్ ఏ.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

జైన్ దేవాలయంలో పూజలు

కాళ్ళ మండలం పెద అమిరంలో స్వయభూ శ్రీ ఋషభ (ఆది)నాథ్ జైన్ దేవాలయంలో అజయ్ జైన్ పూజలు నిర్వహించారు. అనంతరం పాలరాతితో అత్యంత సుందరంగా కట్టిన ఆలయాన్ని, శిల్పాలను పరిశీలించారు. ఆలయం స్థల పురాణం, విశిష్టతను జైన దేవాలయం నిర్వాహకులు ఆయనకు వివరించారు.

ఆది, సోమవారాల్లో నరసాపురం తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు



నరసాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని పరిగణలోకి తీసుకొని నరసాపురం - తిరుపతిల మధ్య ప్రతి ఆది, సోమవారాల్లో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు స్టేషన్ మేనేజర్ మధుబాబు చెప్పారు. జూన్ నుంచి ప్రతి ఆదివారం రాత్రి 10.20 గంటలకు తిరుపతిలో 07131 నెంబరుతో ప్రత్యేక రైలు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు నరసాపురం చేరుకుంటుంది. తిరిగి సాయంత్రం 3.50 గంటలకు 07132 నెంబర్‌తో నరసాపురంలో బయలుదేరి తెల్లవారుజాము 3.20కి తిరుపతి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జూలై 27 వరకు నడుస్తాయన్నారు. జిల్లాలో నరసాపురం, పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకీవీడు, కైకులూర్ స్టేషన్‌లో ఆగుతుందన్నారు. విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, వెంకటగిరి మీదుగా నడుస్తుందని ఎస్‌ఎం చెప్పారు.

స్కాం విచారణ వేగవంతం

రికార్డులు అప్పగించాలని సెంట్రల్ బ్యాంకు అధికారుల్ని కోరిన పోలీసులు

బ్రోకర్ కోసం గాలింపు

బ్యాంకు ఇన్‌చార్జిగా డిప్యూటీ మేనేజర్‌కు బాధ్యతలు



నరసాపురం, మే 22(ఆంధ్రజ్యోతి): తీరంలో సంచలనం రేకెత్తించిన సెంట్రల్ బ్యాంకు స్కాం విచారణను పోలీసులు వేగవంతం చేశారు. పొలాలు లీజుకు తీసు కున్నట్లు ఫోర్జరీ సంతకాలు డాక్యుమెంట్లతో సుమారు రూ.4 కోట్ల రుణం తీసుకున్నారు. ఈ స్కాం ఈనెల 6న వెలుగుచూసింది. బాధిత రైతులు తిరు మాని నాగరాజు, శ్రీనివాస్‌లిద్దరూ ఫిర్యాదు చేయలేదు. రాజీ చేసుకునే ప్రయత్నం చేశారు. కుదరకపోవడంతో రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యా దు చేశారు. దీంతో పోలీసులు రెండు రోజుల నుంచి విచారణను వేగవంతం చేశారు. సీఐ యాదగిరి గురువారం సెంట్రల్ బ్యాంకుకు వెళ్లారు. రుణాలకు సంబంధించిన రికార్డులను విచారణ నిమిత్తం తమకు అప్పగించాలని లిఖితపూర్వకంగా కోరారు. సిబ్బంది నుంచి కొన్ని వివరాలు సేకరించారు. పట్టణానికి చెందిన కూనపరెడ్డి ప్రసాద్, డి చంద్రశేఖర్‌లకు ఈ బ్యాంకులో రుణం ఇప్పించడంలో కీలకంగా ఓ బ్రోకర్ వ్యవహరించాడు. ఈ స్కాం వెలుగుచూసిన మరుసటి రోజు నుంచి ఈ బ్రోకర్ పరారీలో ఉన్నాడు. ప్రస్తుతం కేసు నమోదు కావడంతో పోలీసులు ఆ బ్రోకర్ కోసం గాలిస్తున్నారు. అతను చిక్కితే మొత్తం ఈ కేసులో చిక్కుముడి వీడుతుందన్న భావనలో ఉన్నట్లు తెలిసింది. బ్రోకర్‌కు సంబంధించిన అన్ని వివరాలను ఇప్పటికే నిఘా పోలీసులు సేకరించే పనిలో పడ్డారు. గతంలో కూడా ఈ బ్రోకర్ భారీ కమిషన్లు తీసుకుని ఈ తరహా రుణాలు ఇప్పించాడన్న వాదనలు వినిపిస్తున్నాయి. పోలీసులు వీటన్నింటిపై దృష్టి పెట్టారు. ఇటు బ్యాంకులో కూడా కొన్ని పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మేనేజర్ ప్రకాశ్‌ను బ్యాంకు ఆర్‌ఎం కంట్రోల్‌లో ఉంచి డిప్యూటీ మేనేజర్ ప్రదీప్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే ఈ రుణంపై బ్యాంకు ఉన్నతాధికారులు రెండు పర్యాయాలు దర్యాప్తు చేసి నివేదికను పైఅధికారులకు పంపించారు. వీటితో పాటు పాత రుణాలను కూడా పరిశీలించారు. అయితే ఈకేసులో ఓ సస్పెన్స్ వీడాల్సి ఉంది. రుణం తీసుకునేందుకు మొత్తం 29 ఎకరాలను లీజ్‌గా చూపించారు. ఇందులో 19 ఎకరాలు తిరుమాని నాగరాజు కుటుంబ సభ్యులవి, మిగిలిన పది ఎకరాలు ఎవరదన్నది ఇంత వరకు తెలియలేదు. దీంతో ఆ పది ఎకరాలకు సంబంధించి లీజు అగ్రిమెంట్ జరిగిందా..లేక అవి కూడా ఫోర్జరీ సంతకాలేనా అన్నది కూడా సస్పెన్స్‌గా మారింది. ప్రస్తుతం పోలీసులు విచారణ వేగవంతం చేయడంతో త్వరలో ఈ చిక్కుముడలన్నీ వీడనున్నాయి.



పోలీసు భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పితాని, ఎస్పీ నయీం అస్మి

పోలీసు భవనం ప్రారంభం

పెనుమంట్ర, మే 22 (ఆంధ్రజ్యోతి) : పెనుమంట్రలో నూతనంగా నిర్మించిన పోలీస్ భవనాన్ని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, జిల్లా ఎస్పీ నయీం అస్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నర్సాపురం డీఎస్పీ వేద, పెనుగొండ సర్కిల్ ఇనస్పెక్టర్ రాయుడు విజయ్ కుమార్, పెనుమంట్ర ఎస్సై స్వామి, పెనుగొండ ఎస్సై గంగాధర్, ఆచంట ఎస్సై వెంకటరమణ పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు నూతన భవనాన్ని అందించిన జిల్లా కలెక్టర్ నాగరాణి, స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు



వయ్యేరు కాలువ గట్ల వద్ద నిర్మిస్తున్న ఇన్‌లెట్, అవుట్‌లెట్ పనులు

దువ్వ సేఫ్!

వయ్యేరు కాలువకు గట్లకు ఇన్‌లెట్, అవుట్‌ల పునః నిర్మాణం

తణుకు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): దువ్వ గ్రామంలో వయ్యేరు కాలువ గట్లకు పునః నిర్మాణం చేస్తున్న ఇన్‌లెట్, అవుట్ లెట్‌లతో పలు గ్రామాలకు ముంపు నివారణ తప్పనున్నది. ప్రతి సంవత్సరం ఉమ్మడి జిల్లాలోని మెట్ట, ఎగువ ప్రాంతాలలో వర్షాకాలంలో కురిసే భారీ వర్షాల కారణంగా ఆ ప్రాంతాల్లోని వరదనీరు ఎర్రకాలువ ద్వారా వయ్యేరులోకి ప్రవహించి తణుకు మండలంలోని దువ్వ గ్రామాన్ని ముంచెత్తుతున్నది. వయ్యేరు కాలువకు ఇరువైపులా ఉన్న గట్లకు ఇన్‌లెట్ అవుట్‌లెట్‌లు శిథిలావస్థకు చేరి వాటి తలుపులు పూర్తిగా పాడైపోయాయి. దీనితో వర్షాకాలంలో దువ్వ, చట్టు పక్కల గ్రామాల్లోకి వయ్యేరులోని వరద నీరు చేరుతున్నది. పైగా పంట నష్టం కలుగజేస్తున్నది. దువ్వ గ్రామంలోని వయ్యేరు దగ్గర వీధులన్నీ వరద నీటితో నిండిపోయి జన జీవనం అస్తవ్యస్తంగా మారిపోతున్నది. ఎర్ర కాలువ వరద నీరు గ్రామంలోకి రాకుండా ఉండేందుకు అధికారులు శిథిలమైన అవుట్ లెట్, ఇన్‌లెట్‌ల వద్ద ఇసుక బస్తాలు, సర్వే కర్రలను అడ్డుపెట్టినా వరద నీటిని అడ్డుకోలేకపోతున్నాయి. ఈ పరిస్థితుల నుంచి రైతులను, గ్రామస్థులను గట్టెక్కించేందుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చొరవంతో గ్రామంలో రెండు ఇన్‌లెట్, అవుట్‌ల పునర్నిర్మాణానికి రూ.70 లక్షలతో పనులు ప్రారంభించారు. వీటి నిర్మాణ పనులు శర వేగంగా జరుగుతున్నాయి. ఈ నిర్మాణాలు పూర్తయితే రాబోయే వర్షాకాలంలో ఎర్రకాలువ వరద నుంచి దువ్వ గ్రామానికి ఇబ్బందులుండవని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ఎంతో మేలు



దువ్వ గ్రామంలో ఇన్‌లెట్ అవుట్‌లెట్‌ల నిర్మాణంతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. చేలల్లో పేరుకుపోయిన మురుగు నీరు అవుట్‌లెట్ ద్వారా వయ్యేరులోకి పోతుంది. దీని వలన రైతులకు చేలలో మురుగు సమస్య తీరి పంట నష్టం తగ్గి, దిగుబడి పెరుగుతుంది.

- అరిగెల బాబి, రైతు దువ్వ

పది రోజుల్లో నిర్మాణాలు పూర్తి

ఇన్‌లెట్ అవుట్‌లెట్‌ల నిర్మాణం పనులు పది రోజుల్లో పూర్తవుతాయి. సుమారు రూ.70 లక్షలతో పనులు చేస్తున్నాం. ఈ పనులు పూర్తయితే పొలాలు, గ్రామాలు ముంపు సమస్య నుంచి బయట పడతాయి.

- హరికిషన్, ఏఈ ఇరిగేషన్ తణుకు

డబ్బులిస్తేనే ఉచిత వైద్యం!

ఏలూరు జిల్లాలో 30 ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు

పేదరోగులకు ఉచిత వైద్య సేవలందించేందుకు ఏలూరు జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తోన్న ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న అభియోగాలపై 30 ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్యులకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. నోటీసులు జారీఅయిన ఆసుపత్రుల్లో ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, మరో 4 ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఒక పీహెచ్‌సీ కూడా ఉండటం విశేషం. వీటితో పాటు ప్రైవేటురంగంలో నిర్వహిస్తోన్న 24 నెట్‌వర్క్ ఆసుపత్రులు కూడా ఉన్నాయి. బుధవారం జారీ చేసిన షోకాజ్‌నోటీసులకు వారం రోజుల్లోగా సంబంధిత రోగులను పిలిపించుకుని నమోదైన అభియోగాలపై వివరణలు తీసుకుని పంపాలని వైద్య మిత్రలను, అలాగే పేషెంట్ నుంచి లిఖిత పూర్వక లేఖలను తీసుకుని తమకు అందజేయాలని ఆయా ప్రభుత్వ ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రులను ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ఆదేశించింది.



ఏలూరు అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద పేద రోగులకు ఉచిత వైద్యసేవలందించేందుకు మొత్తం 3225 రకాల ప్రొసీజర్ల (రుగ్మత/వ్యాధి/రోగం/జబ్బు)కింద వైద్యం, శస్త్ర చికిత్సలు చేసేందుకు ప్రభుత్వం ఏలూరు జిల్లాలో 33 ప్రైవేటు, 11 ప్రభుత్వాసుపత్రులను నెట్‌వర్క్ ఆసుపత్రులుగా గుర్తించింది. వీటిలో ఉచిత వైద్య సేవలందించినందుకు గాను చికిత్సను బట్టి రేటును నిర్ధారించి, మొత్తంమీద నెలకు రూ.2 కోట్లను రీయింబర్స్‌మెంట్ కింద సంబంధిత ఆసుపత్రులకు ప్రభుత్వం చెల్లి స్తోంది. నిబంధనల ప్రకారం నెట్‌వర్క్ ఆసుపత్రిలో చేరిన రోగికి వైద్యుల సూచనల మేరకు అవసరమైన రోగనిర్ధారణ పరీక్షలు, చికిత్స/శస్త్రచికిత్స, వార్డు ఖర్చులు, భోజనసౌకర్యం, తదితర ఖర్చులన్నీ ప్రభుత్వమే ఆసుపత్రికి తిరిగి చెల్లించే పద్ధతిన భరిస్తోంది. ఈ క్రమంలో జిల్లాలో నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో రోగులకు అందుతున్న సేవలపై చికిత్స అనంతరం డిశ్చార్జిఅయిన పేషెంట్ల నుంచి వారంరోజులక్రితం ఐవీఆర్‌ఎస్ పద్ధతిన ఆన్‌లైన్ రికార్డువిధానంలో ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు మెడికల్ ఆడిట్ బృందాలు నేరుగా ఫోన్‌ద్వారా వివరాలు సేకరించాయి. జిల్లాకు సంబంధించి మొత్తం 165 రకాల ఫిర్యాదులు రోగుల నుంచి వచ్చాయి. వీటిలో ప్రభుత్వాసుపత్రులకు సంబంధించి డెలివరీ కేసులు, గైనిక్ కేసులు, ప్రైవేటు ఆసుపత్రులకు సంబంధించి కార్డియాలజీ, ఆర్థో, యురాలజీ, కంటి సంబంధిత వైద్యచికిత్సల నుంచి ఉన్నాయి. ఎక్కువగా జిల్లాకేంద్రానికి చేరువగావున్న ఒక ప్రైవేటు ఆసుపత్రిపై 42 ఫిర్యాదులురాగా, నగర శివార్లలోవున్న మరో ప్రైవేటు ఆసుపత్రిపై 13 ఫిర్యాదులు, ప్రభుత్వాసుపత్రులపై 30 ఫిర్యాదులు, మిగతా నెట్‌వర్క్ ఆసుపత్రులపై ఒకటి నుంచి ఐదువరకు ఫిర్యాదులు వచ్చాయి. ఉచిత వైద్యమంటూ ఈ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న రోగులనుంచి అదనపు వసూళ్లకు పాల్పడ్డారని సంబంధిత రోగులు ఐవీఆర్‌ఎస్ ద్వారా చికిత్స, డిశ్చార్జి అనంతరం ఫీడ్‌బ్యాక్ వివరాలసేకరణలో ఫిర్యాదులు చేశారు. ఆ ప్రకారం సంబంధిత రోగులను ఆసుపత్రికి పిలిపించి ఫిర్యాదు అంశాలపై నిర్ధారించుకోవాలని, అలాగే ఆసుపత్రి యాజమాన్యం కూడా లిఖితపూర్వక వివరణను పంపాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే షోకాజ్ నోటీసులను జారీ చేశారు. రోగినుంచి డబ్బులు తీసుకున్నట్టు నిర్ధారణ అయితే పెద్దమొత్తంలో జరిమానా విధించే అవకాశాలు లేకపోలేదని వివరించాయి.

నేడు బదిలీ టీచర్లకు ప్రత్యేక మెడికల్ క్యాంపు

ఏలూరు అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : సాధారణ బదిలీల్లో భాగంగా రీ-అపోర్షన్‌కులోనైన ఉపాధ్యాయులు, ప్రిఫరెన్షియల్ కేటగిరిలోకి వస్తున్న ఉపాధ్యాయులు బదిలీకి అర్హత పొందేందుకు అవసరమైన మెడికల్ సర్టిఫికెట్లను పొందేందుకు ఈ నెల 23న ఉదయం 9గంటలకు ఏలూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిర్వహించే ప్రత్యేక మెడికల్ క్యాంపునకు తప్పనిసరిగా హాజరుకావాలని ఉమ్మడిజిల్లా డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదేశించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లాలోని ఏలూరు, భీమవరం, రాజమండ్రి జిల్లాల పరిధిలో పనిచేస్తున్న ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న సంబంధిత ఉపాధ్యాయులు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో 24నుంచి 26వరకు నిర్వహించిన మెడికల్ క్యాంపునకు అనివార్య కారణాలవల్ల హాజరుకాలేకపోయిన ఉపాధ్యాయులుకూడా శుక్రవారం నిర్వహించే ప్రత్యేక క్యాంపునకు హాజరయ్యేందుకు వెసులుబాటు కల్పించినట్టు తెలిపారు. వీరంతా మెడికల్ రిపోర్టులతో హాజరై, మెడికల్ బోర్డు సమక్షంలో వైద్యపరీక్షలు చేయించుకుని, అవసరమైన వైద్య ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు. శుక్రవారం నిర్వహించే మెడికల్ క్యాంపులో బోర్డుద్వారా జారీచేసే వైద్య ధ్రువీకరణ పత్రాల ఆధారంగానే బదిలీప్రక్రియలో ప్రిఫరెన్షియల్ కేటగిరీగా పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు. ఏప్రిల్‌లో నిర్వహించిన మెడికల్ క్యాంపులో ఇప్పటికే వైద్య ధ్రువీకరణ పత్రం పొందిన ఉపాధ్యాయులు శుక్రవారం నిర్వహించే ప్రత్యేక క్యాంపునకు హాజరుకానవసరంలేదని స్పష్టం చేశారు.

ఆర్‌ఎంపీలు సిఫార్సు చేయవద్దు

పాలకొల్లు, మే 22(ఆంధ్రజ్యోతి): గర్భిణులు అర్హులైన వైద్యులనే సంప్రదించాలని, నాటు వైద్యులను, ఆర్‌ఎంపీ, పీఎంపీలను ఆశ్రయించవద్దని పశ్చిమగోదావరి జిల్లావైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి గీతా బాయి అన్నారు. లంకలకోడేరు పీహెచ్‌సీలో ఈమేరకు ఒకప్రకటన విడుదల చేశారు. ఆర్‌ఎంపీలు గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లకు సిఫార్సులు చేయరాదని, గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యుల సలహా మేరకు ప్రభుత్వ ఆసుపత్రిల్లో వైద్యం పొందాలని సూచించారు. దీనివల్ల మాతృ మరణాలు, శిశుమరణాలను నియంత్రించ వచ్చునని డాక్టర్ గీతాబాయి తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఏరియా ఆసుపత్రి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (తణుకు)లో ఉచితంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్ తీయడం జరుగుతుందని తెలిపారు. ఆర్‌ఎంపీలు గర్భిణులకు వైద్యం చేసినా, అల్ట్రాసౌండ్ స్కానింగ్ సిఫార్స్ చేసినా వారి వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఫిర్యాదు చేయవచ్చునని డాక్టర్ గీతాబాయి సూచించారు.

రైతులకు అండగా ప్రభుత్వం

మంత్రి రామానాయుడు

పాలకొల్లు రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): శ్రమను నమ్ముకుని వ్యవసాయమే జీవనాధారంగా పంటసాగు చేస్తున్న రైతుకు అండగా ప్రభుత్వం ఉందని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని తిల్లపూడి, రూరల్ పంచాయతీ పరిధిలో రూ.68.19లక్షలతో చేపట్టనున్న గ్రావెల్‌రోడ్డు, సీసీ వాల్ నిర్మాణ పనులకు, ఛానల్ తవ్వకం పనులకు గురువారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కాల్వలు, డ్రెయిన్లను పట్టించుకోకపోవడంతో సాగునీరు అందక, భారీవర్షాలు వస్తే పంటచేల్లో నుంచి మురుగు నీరు బయటకు వెళ్లక రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. రైతులు పొలాలకు వెళ్లే రోడ్లకు కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదన్నారు. పంట చేతికొచ్చిన తర్వాత ధాన్యం కొనుగోళ్లలో రైతులను మోసం చేసిందని, ధాన్యం సొమ్ములు జమ చేయకుండా రైతులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేసిన ఘనత గత ప్రభుత్వానికే దక్కిందన్నారు. పాలకొల్లు ఏఎంసీ చైర్మెన్ కోడి విజయభాస్కర్, మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, కృష్ణాజిల్లా బీజేపీ ఇన్‌చార్జ్ ఉన్నమట్ల కబర్ధి, నీటిసంఘాల అధ్యక్షులు ఇంటి శ్రీరాముడు, మాతా రత్నరాజు, తాళంక కృష్ణ పాల్గొన్నారు.



పూలపల్లి ఛానల్ తవ్వకం పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి రామానాయుడు

ముగ్గురికి జైలు శిక్ష

ఏలూరు క్రైం/జీలుగుమిల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసంగించిన కేసులో ప్రధాన నిందితుడితో పాటు అతడి తల్లిదండ్రులకు జైలు శిక్ష విధిస్తూ ఏలూరులోని ఐదవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసి క్యూషన్ కథనం ప్రకారం జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక యువతి బుట్టాయిగూడెం మండలం సూరప్ప వారిగూడానికి చెందిన పోసూరి అంజి ప్రసాద్ (27)కు ఒక పెళ్లిలో పరిచయం అయింది. ఆమెను ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని నమ్మించి వివాహేతర సంబంధం కొనసాగించాడు. అతని తల్లి దండ్రులు ద్వారా పెళ్లి సంబంధం మాట్లాడుకుంటుండగా కట్న కానుకలు ఇవ్వడం లేదని పెళ్లికి నిరాకరించారు. దీంతో బాధితురాలు జీలుగుమిల్లి పోలీసులకు 2021లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ విశ్వనాథ బాబు కేసు నమోదు చేశారు. అప్పటి పోలవరం ఇన్‌స్పెక్టర్ ఏఎన్‌ఎన్ మూర్తి కేసు దర్యాప్తు చేశారు. ప్రధాన నిందితుడైన అంజి ప్రసాద్‌కు పదకొండున్నర సంవత్సరాల జైలు శిక్ష, 11 వేల రూపాయల జరిమానా అతని తల్లి రామలక్ష్మి, తండ్రి సాంబశివరావులకు ఒక్కొక్కరికి ఆరు నెలలు జైలు శిక్ష, ఒక్కొక్కరికి వెయ్యి రూపా యలు జరిమానా కోర్టు విధించింది. ఏపీపీ డీవీ రామాంజనేయులు కేసు వాదించారు.

ఏజెన్సీలో పోలీసు తనిఖీలు

పోలవరం, మే 22: పోలవరం ప్రాజెక్టుతో పాటు పోలవరం మండల కేంద్రంలో ఎస్‌ఐ పవన్ కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ బెటాలియన్, బాంబ్ స్క్వాడ్‌లు తనిఖీలు నిర్వహించారు. ఆదివారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అబూజ్‌మడ్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేతలు హతమైన నేపథ్యంలో పోలవరం రాకపోకలు సాగించే ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలు, అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని తనిఖీలు నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టులో ప్రధాన ప్రాంతాలను బాంబు స్క్వాడ్‌తో కూడా తనిఖీలు నిర్వహించామని ఎస్‌ఐ తెలిపారు. మావోయిస్టులు ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో తలదాచుకునే అవకాశాలున్న నేపథ్యంలో డ్రోన్ కెమెరాలతో గాలింపు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావలసిన అవసరం లేదని, అనుమానాస్పద వ్యక్తులను గమనిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

కుక్కునూరు: కుక్కునూరు పోలీసులు గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కుక్కునూరు ప్రధాన రహదారిపై నాలుగు చోట్ల పోలీసులు వాహనాలు తనిఖీలు చేశారు. కుక్కునూరులోని యూనియన్ బ్యాంకులో పోలీస్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు కుక్కునూరు ఎస్సై రామకృష్ణ తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి కుక్కునూరు మండలం సరిహద్దుగా ఉండటం, గోదావరి తీర ప్రాంతం కావడంతో భద్రతాచర్యలు విస్తృతంగా చేస్తున్నట్లు సమాచారం.



కుక్కునూరులోని యూనియన్ బ్యాంకులో పోలీసుల తనిఖీలు

దైవ దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం

» ఆగి ఉన్న లారీని ఢీకొన్న టాటా మ్యాజిక్ » పది మందికి గాయాలు..

» రాజానగరం వద్ద ఘటన » క్షతగాత్రుల స్వగ్రామం ఏలూరు జిల్లా చెక్కపల్లి

రాజానగరం, మే 22 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రమైన అన్నవరం దైవదర్శనానికి వెళ్తుండగా మార్గమధ్యలో రాజానగరం సమీపంలో హైవేపై ఆగి ఉన్న లారీని, టాటా మ్యాజిక్ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన పది మంది గాయపడ్డారు. బుధవారం అర్ధరాత్రి దాటాక ఒంటిగంట సమయంలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన నాగుల వెంకటేశ్వరరావు, నాగుల రాజ్యలక్ష్మి, బి.రఘుబాబు, బి.లక్ష్మీదుర్గ, తాళం రాధ, బి.దేవిక, బి.లోకేశ్వరరావు, బి.దేవేంద్ర, ఎన్.పావని ఒకే కుటుంబానికి చెందిన బంధువులు. వీరంతా టాటా మ్యాజిక్ వ్యాన్‌లో అన్నవరం సత్యదేవుని దర్శనానికి బయలుదేరారు. మార్గమధ్యలో రాజానగరం సమీపానికి వచ్చే సరికి హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వ్యాన్‌లో ప్రయాణిస్తున్నవారంతా గాయపడ్డారు. డ్రైవర్ చింతలచెరువు మధుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ వాహనంలో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించినట్టు రాజానగరం పోలీసులు తెలిపారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు నిర్ధారించినట్టు ఎస్‌ఐ నాగార్జున చెప్పారు. వ్యాన్ డ్రైవర్ రెప్పపాటు కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.



క్షతగాత్రులను 108 వాహనంలోకి ఎక్కిస్తున్న దృశ్యం

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

మొగల్తూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు పోలీస్‌స్టేషన్ పరిధి వెంప గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన ఘైనమిది. మొగల్తూరు ఎస్‌ఐ వై.నాగలక్ష్మీ కథనం ప్రకారం భీమవరం మండ లం వెంప గ్రామానికి చెందిన బాదాపు పుష్పారావు (45) బుధవారం రాత్రి గ్రామంలో జరిగే క్రైస్తవ కూటమి సభకు వెళ్ళాడు. ఆసభ ప్రాంగణంలో ఫ్యాన్ అకస్మాత్తుగా వైర్లు తెగి మృతునిపై పడటంతో విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే స్పందిచిన స్థానికులు భీమవరం ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అప్పటికే వైద్యులు మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ఈసంఘటనపై మృతుని కమారుడు వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.



మొబలైజేషన్ డ్రిల్ నిర్వహిస్తున్న రైల్వే పోలీసులు

ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో మొబలైజేషన్ డ్రిల్

ఏలూరు క్రైం, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్, ఏఆర్‌పీ పోలీసులు గురువారం మొబలైజేషన్ డ్రిల్ నిర్వహించారు. బెదిరింపులు, ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు, వరదలు వంటి అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా విధులను నిర్వర్తించడానికి ఈ డ్రిల్ ఎంతో ఉపయోగపడుతుందని, మెళకువలను నేర్చుకోవడం జరుగుతుందని రైల్వే ఎస్‌ఐ పి.సైమన్ తెలిపారు. విపత్తు నిర్వహణ పరికరాలు, పహల్గాం ఉగ్రవాద దాడి తరువాత ప్రస్తుత భద్రత పరిస్థితులపై పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తెలుగుభాష ప్రాచుర్యంపై బాలలకు పోటీలు

భీమవరం టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషా ప్రాచుర్యంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో బాలల రచనలకు ఆహ్వానం పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. గురువారం సర్ సీవీ రామన్ స్కూల్లో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వేసవి సెలవుల్లో అనేక శిక్షణ శిబిరాలు ఉంటాయని, వాటిలో బాలబాలికలకు సామెతలు, పొడుపు కథలు, పద్యాలు, కవితలు ఇత్యాది అంశంపై పేజీన్నర మించకుండా వచ్చేనెల 3వ తేదీ లోపు అందించాలన్నారు. వీరిలో విజేతలకు బహుమతులు అందజేస్తామని 9290719983 కు పంపించాలని అన్నారు.

ఫొటోగ్రఫీ, వీడియో మిక్సింగ్‌పై ఉచిత శిక్షణ

పెదపాడు, మే 22(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత యువతీ యువకులకు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం.ఫణికిశోర్ తెలిపారు. 19-45 సంవత్సరాల మధ్య యువతీ యువకులు టెన్త్, ఆపైన విద్యార్హత గలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల వారు(99485 65256, 99485 65256, 90140 40780)నెంబర్లలో సంప్రదించాలని కోరారు. 30 రోజుల శిక్షణ కాలంలో ఉచిత వసతితో కూడిన భోజన సౌకర్యం ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : రూరల్ మండలం మాదేపల్లి సెక్షన్ పరిధిలోని పోణంగి సబ్‌స్టేషన్‌లో శుక్రవారం మరమ్మతులు నిర్వహిస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు వైఎస్సార్ కాలనీ, పోణంగి రోడ్, వీఎస్ఆర్ గ్రాండ్ సిటీ, రాజరాజేశ్వరి నగర్, శ్రీరామ నగర్ కాలనీ, ఈనమ్మ గుంట జగనన్న కాలనీ, మరడాని రంగారావు కాలనీలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

అంధులకు విద్యా వసతి కల్పన

ఏలూరు రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు గత 32 సంవత్సరాలుగా ఏలూరులోని అంధుల సంక్షేమ సంఘం ద్వారా విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కంటి చూపులేని మహిళలను 16 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి నిరక్షరాస్యులు, అక్షరాస్యులైనా వారందరికీ విద్యను అందించి ఉపాధి కల్పించడానికి దాతల సహకారంతో భోజన వసతిని కల్పిస్తూ ఇంటర్మీడియట్ డిగ్రీ, వివిధ కోర్సులను అభ్యసించడానికి అవకాశం కల్పిస్తుందన్నారు. విద్యతో పాటు బ్రెయిలీ లిపిలో శిక్షణ అందించడం, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందిస్తామన్నారు. అంధుల సంక్షేమ సంఘం ద్వారా చదువుకున్న 65 మంది మహిళలు ప్రభుత్వ ఉద్యోగులను సాధించారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరింత సమాచారానికి న్యూ పోస్టల్ కాలనీ, చాటపర్రు రోడ్డు, వెంకటాపురం పంచాయితీ, ఏలూరు వన్‌టౌన్(90324 42475) సంప్రదించాలని కోరారు.

జిల్లాలో సరాసరి 17.7 మి.మీ. వర్షపాతం

ఏలూరుసిటీ, మే 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో పలు ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు భారీ వర్షాలు కురిశాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోను వర్షపాతాలు నమోదయ్యాయి. గత 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా పెదపాడు మండలంలో 52.8 మిల్లీమీటర్లు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 17.7 మిల్లీమీటర్లుగా నమోదైంది. మరో రెండు రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులతో పాటు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

రోజుకు 1100 రైస్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ఏలూరుసిటీ, మే 22(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైస్‌కార్డులకు సంబంధించి నేటి వరకు జిల్లా వ్యాప్తంగా సరాసరిన రోజుకు 1100 దరఖాస్తులు స్వీకరించనున్నట్టు జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి శివరామ్మూర్తి గురువారం తెలిపారు. ఒకేసారి ఎక్కువ మొత్తంలో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుండటంతో సర్వర్ బిజీగా ఉండటంతో కొంత ఆలస్యం జరుగుతోందని, ఈ విషయంలో గ్రామ/వార్డు సచివాయాల సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో ఉండి దరఖాస్తుల స్వీకరణలో జాప్యం లేకుండా చూడాలని తెలియజేశామన్నారు.

విజయవాడ సభను జయప్రదం చేయండి

చింతలపూడి, మే 22(ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జూన్ 5న జరిగే రాష్ట్ర మహాసభకు ఉద్యోగులంతా హాజరుకావాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మాదిరెడ్డి రాము కోరారు. ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణలో చింతలపూడి తాలూకా యూనిట్ ఉద్యోగుల సమావేశం గురువారం జరిగింది. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఈ సభకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా వస్తారని,రాష్ట్ర సంఘ అధ్యక్షులు ఆర్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో సభ జరుగుతుందన్నారు. అనంతరం సభా గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం రాము మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై చర్చ ఉంటుందని, ఉద్యోగులకు రావాల్సిన డీఏ, 11 పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, 12వ పీఆర్సీ కమిషన్ గురించి సీఎంకు వివరించనున్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్.ఎస్.వి.రామకృష్ణారావు, జాయింట్ సెక్రటరి టి.గోవిందరావు, ఉపాధ్యక్షులు నల్లా అప్పారావు, టి.నీలిమాదేవి, పెనుగొండ శ్రీనివాస్, కొండపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలవరాన్ని జిల్లా కేంద్రం చేయండి

పోలవరం, మే 22(ఆంధ్రజ్యోతి) : పోలవరం ఏజెన్సీ జిల్లా ఏర్పాటు చేయాలని ఏలూరు జిల్లా యాదవ సంఘం డైరెక్టర్ కోరశిక నాగబాబు కోరారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక పోలవరం ఏజెన్సీ జిల్లా ఏర్పాటు చేస్తారనే ఆశాభావంతో ప్రజలు ఉన్నారని అన్నారు. పోలవరం గ్రామ ప్రజలు భూములు, ఉపాధిని కోల్పోయారని, వ్యాపారాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. చేసేది లేక స్థానికులు పొరుగు గ్రామాలకు వలస పోతున్నారని అన్నారు. ఏజెన్సీ జిల్లాకు పోలవరాన్ని కేంద్రంగా చేస్తే వ్యాపారాలు పెరిగి ఉపాధి దొరుకుతుందన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం స్పందించి జిల్లా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, జిల్లా సాధన జేఏసీ, నాయకులు, ఉద్యోగులు కోరారు.

రూ.270 కోట్లతో విద్యుత్ శాఖ ఆధునికీకరణ పనులు

చింతలపూడి, మే 22(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 270 కోట్లతో ఆర్డీఎస్ఎస్ పథకం కింద విద్యుత్ శాఖలో ఆధునికీకరణ పనులు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆవరణలో గురువారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతులు, గృహ వినియోగదారులకు అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 24 గంటలు విద్యుత్ సరఫరా, వ్యవసాయానికి తొమ్మిది గంటల పాటు విద్యుత్ అందించే లక్ష్యంతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు జరుగుతున్నాయన్నారు.సమావేశంలో జంగారెడ్డిగూడెం విద్యుత్ శాఖ డీఈ పీర్ అహ్మద్, పెదవేగి డీఈ అంబేద్కర్, కూటమి నాయకులు జె.ముత్తారెడ్డి, ఎం. వెంకట్రామయ్య, మధుబాబు పాల్గొన్నారు.

కె.ఎస్.జవహర్‌ను కలిసిన బీజేపీ నాయకులు



ఏలూరు రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ మంత్రి కె.ఎస్.జవహర్‌ను గురువారం కొవ్వూరు క్యాంపు కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సి.హెచ్.విక్రమ్ కిశోర్, ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి పోలిమేర హరికృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎస్సీ కమిషన్ ఏర్పడిన తరువాత మొట్టమొదటిసారిగా మాదిక సామాజిక వర్గానికి చెందిన విద్యావేత్త జవహర్‌ను నియమించడం అభినందనీయమన్నారు.

మహిళలు రక్షణ చట్టాలపై అవగాహన పొందాలి

ఏలూరు క్రైం, మే 22(ఆంధ్రజ్యోతి) : బాలికలు, మహిళలకు ఎన్నో రక్షణ చట్టాలున్నాయని వాటిని తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు అన్నారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని ఏలూరు గవర్నమెంట్ ఐటీఐ కాలేజీలో గురువారం నిర్వహించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన సదస్సులో సీఐ సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థినులకు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సహాయం కోసం 112కు కాల్ చేయాలని పది నిమిషాల్లో పోలీసులు చేరుకుంటారన్నారు.

అనారోగ్యంతో మృతి చెందిన వైద్యుడికి నివాళి

పెదవేగి, మే 22(ఆంధ్రజ్యోతి) : దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఎం.నరేంద్ర అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతిచెందారు. 12ఏళ్లుగా దంతవైద్య కళాశాలలో పెరియో డోంటిక్స్ విభాగంలో అధ్యాపకునిగా పనిచేసిన నరేంద్ర కేన్సర్ బారిన పడి హైదరాబాద్‌లో చికిత్స తీసుకుంటూ బుధవారం ఉదయం మృతి చెందారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మృతికి సంతాపం తెలియజేస్తూ, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పీఠం వికార్ జనరల్ ఫాదర్ పి.బాల, ఛాన్సలర్ ఫాదర్ ఇమ్మానియేల్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.స్లీవరాజు, ఏవో ఫాదర్ ఫెలిక్స్, నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి.జాకబ్, ఏలూరు పీఠం పాస్టర్ సెంటర్ ఫాదర్ బాబుజార్జ్, ఫాదర్ మైఖేల్ పాల్గొని నివాళులర్పించారు.

ఆంజనేయ స్వామికి వెండి ఆభరణాల బహూకరణ

ఏలూరు కార్పొరేషన్, మే 22(ఆంధ్రజ్యోతి) :పడమర వీధిలోని విజయ గ్యాస్ గొడౌన్ పంపిణీ రోడ్డులోని అభయాంజనేయ స్వామి మందిరం వద్ద స్వామికి గురువారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని అదే ప్రాంతానికి చెందిన కొట్టు మధు కుటుంబ సభ్యులు వెండి ఆభరణాలను బహూకరించారు. తొలుత ఈ ఆభరణాలను నగరంలో ప్రదర్శన జరిపి అనంతరం మందిరానికి చేరుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి హనుమాన్ చాలీసా పఠించి అనంతరం ఆభరణాలను బహూకరించారు. కార్యక్రమంలో కొట్టు మధు కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణపై చేబ్రోలులో వీధి నాటకం

ఉంగుటూరు, మే 22(ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ గురువారం మండలంలోని చేబ్రోలులో తల్లాపురం వెళ్లే రహదారిలో వీధి నాటకాన్ని కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారులు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాకారుల బృందంలో ఎం.తిరుపతి కుమార్, వి.సుబ్బారావు, ఎం.దివ్య శ్రీవిద్య, వి.వాణి. వి.ప్రసాద్, ఎం.కుమార్‌లు ఉన్నారు. సి.ఎఫ్.ఐ. లింక్ వర్కర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ తరపున డి.ఆర్.పి.రాజశేఖర్, సి.ఎల్.డబ్ల్యూ రాణి, సూపర్ వైజర్ దుర్గా భవాని హాజరయ్యారు.



ఏలూరు అగ్రహారం, అంబికా ఆలయంలో ఆంజనేయుడు



తాడిచర్ల ఆంజనేయుడి విగ్రహం వద్ద నాయకులు



గాలాయగూడెం ఆంజనేయుని సన్నిధిలో చింతమనేని

ఘనంగా హనుమజ్జయంతి

ఏలూరు రూరల్/దెందులూరు/పోలవరం/బుట్టాయగూడెం/ద్వారకాతిరుమల/టి.నరసాపురం/జీలుగుమిల్లి, మే 22(ఆంధ్రజ్యోతి) : హనుమజ్జయంతి సందర్భంగా విశ్వహిందూ ఆధ్వర్యంలో హనుమాన్ శోభయాత్ర బైక్ ర్యాలీ అంగరంగ వైభవంగా సాగింది. తొలుత రామకోటి వద్ద భారీ హనుమంతుని ప్రతిమను, ప్రత్యేకంగా పూలతో అలంకరించి రథంపై పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శోభయాత్రను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయులు చౌదరి, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ శోభాయాత్ర బైక్ ర్యాలీ ఏలూరు ఓల్డ్ మార్కెట్,చందనా బ్రదర్స్ సెంటర్, టూటౌన్ ఏరియా, ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా రామకోటికి చేరుకుంది. కార్యక్రమంలో నాయకులు చౌటపల్లి విక్రమ్ కిషోర్, కన్నెని కృష్ణ ప్రసాద్, ప్రాంత వివేకానంద, కేంద్ర నిర్వాహకులు సదాశివ, సత్యానందగిరి స్వామీ, చౌటపల్లి పాల్గొన్నారు. అలాగే ఏలూరులోని పలు ప్రాంతాల్లో పూజలు చేశారు. హనుమజ్జయంతిని పురస్కరించుకుని దెందులూరు మండల వ్యాప్తంగా రామాలయాలు,ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు తెల్లవారు జాము నుంచి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాలాయిగూడెం గౌడవీధిలోని అభయాంజనేయ స్వామిని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, రాధమ్మ దంపతులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామాధ్యక్షుడు పూజారి శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ మద్దా దయనందరాజు, పూజారి వెంకటరత్నం నాయుడు పూర్ణకుంభంతో ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించారు. కొవ్వలి హైస్కూల్ వెనుక ఉన్న హనుమంతుడి ఆలయం, దెందులూరు, పెరుగుగూడెం, చల్లంతలపూడి, పోతునూరు, సోమవరప్పాడుతో పాటు పలు ఆలయాల్లో భక్తులు స్వామిని దర్శించుకుని పంచామృతాలు, తమలపాకులతో అర్చనలు నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు కార్యాలయం సమీపంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రాజెక్టు అధికారులు హనుమజ్జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ అధికారులు, పోలీస్ శాఖ, వ్యాప్కోస్, మెగా, బావర్ కంపెనీల ప్రతినిధులు, ఇంజనీర్లు సిబ్బంది పాల్గొన్నారు. బుట్టాయగూడెం, రెడ్డిగణపవరంలోని విశ్వేశ్వర అన్నపూర్ణ కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతిని నిర్వహించారు. రెడ్డిగణపవరంలో అర్చకులు నాగభట్ల పద్మనాభచారి ఆధ్వర్యంలో అష్టోత్తపూజలు నిర్వహించారు. ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, పండితులు స్వామిని విశేష పుష్పాలంకారాలు చేశారు. జీలుగుమిల్లి మండల వ్యాప్తంగా హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. జీలుగుమిల్లిలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ దంపతులు బంగారు బొట్టును స్వామికి అందజేశారు. అర్చకులు కె.చిరంజీవిశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయం కమిటీ, ఆర్యవైశ్య సంఘం, దాసు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. దర్భగూడెం, లక్ష్మీపురం, రౌతుగూడెం, ములగలంపల్లి, వంకవారిగూడెం గ్రామాల్లో ఆలయాల్లో అంజనేయస్వామికి స్థానికులు ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి చాత్రాతి ప్రసాద్, మండల అధ్యక్షులు గుడ్ల రాము, కోలా ధర్మరాజు, కొప్పుల అన్నవరం, చిట్లూరి చందరావు, లక్ష్మీపురం బైక్ ర్యాలీలో సీనియర్ నాయకులు కొల్లూరి రాంబాబు, కేలిరెడ్డి రాఘవ రెడ్డి, కొప్పుల చౌదరరెడ్డి, పులగం సుబ్బారెడ్డి ఉన్నారు. టి.నర్సాపురంతో పాటు మండలంలోని అప్పలరాజుగూడెం, తిరుమలదేవిపేట, బొర్రంపాలెం, మక్కినవారిగూడెం గ్రామాల్లో హనుమజ్జయంతిని నిర్వహించారు. కృష్ణాపురంలో ఇంటింటికి హనుమాన్ జెండాలు పంచారు. కార్యక్రమంలో చట్రాసి యుగందర్, మురళీ, కమ్మిల రమేశ్ రాజు, వేణుగోపాల్ నాయక్, తవరం సురేశ్, శ్రీనివాస్, భూక్యారాము, రమేశ్, ధనలక్ష్మి, రాజీ, భద్రమ్మ పాల్గొన్నారు.

కామవరపుకోట : మండల వ్యాప్తంగా హనుమజ్జయంతిని నిర్వహించారు. తాడిచర్లలో ఇటీవల ప్రారంభమైన 25 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, సర్పంచ్ పసుమర్తి పార్థసారథి బాబు మిత్ర బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తడికలపూడి, ఆడమిల్లి, వీరిశెట్టిగూడెం గ్రామాల్లో శోభాయాత్రలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.



మంత్రి లోకేశ్‌తో ముస్తఫా

మంత్రి లోకేశ్ దృష్టికి సమస్యలు

జంగారెడ్డిగూడెం, మే 22(ఆంధ్రజ్యోతి) : మంత్రి నారా లోకేశ్‌ను వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు షేక్ ముస్తఫా గురువారం ఉండవల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మైనార్టీల సమస్యలపైన, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కార్యకర్తల పరిస్థితి, ప్రభుత్వ పథకాలపై మంత్రి లోకేశ్‌తో చర్చించినట్టు ముస్తఫా తెలిపారు.

గుండె పోటుతో అంగన్‌వాడీ మృతి

కుక్కునూరు, మే 22(ఆంధ్రజ్యోతి) : దాచారం గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్న మధుర రాజేశ్వరి(40) గురువారం గుండె పోటుతో మృతి చెందారు. ఉదయం గుండెల్లో నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు చెప్పింది. ఆమె భర్త వెంకట రమణ వైద్యుడి కోసం కుక్కునూరు వస్తున్న క్రమంలోనే ఆమె మృతి చెందింది. టీడీపీ మండలాధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, ఉప సర్పంచ్ పిచుక రాజు, బొల్లు కృష్ణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఎక్సైజ్ దాడుల్లో ఇద్దరిపై కేసు

చింతలపూడి, మే 22(ఆంధ్రజ్యోతి) : యర్రగుంటపల్లి గ్రామంలో ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి నాయుడు సత్య వతి, గొలిశెట్టి రోజాపై కేసులు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు. సత్యవతి నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని, ఆమెకు సారా సరఫరా చేస్తున్న అదే గ్రామానికి చెందిన గొలిశెట్టి రోజాపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సత్యవతిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్టు తెలిపారు. రాఘవాపురం గ్రామంలో బ్రాందీ షాపును ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ దాడుల్లో ఎస్ఐలు ఆర్.వి.ఎల్.నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, జె.జగ్గారావు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా సాంబశివరావు

జంగారెడ్డిగూడెం, మే 22(ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీవో)గా ఎస్.సాంబశివరావు బుధవారం విధుల్లో చేరినట్టు మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ గురువారం తెలిపారు. సాంబశివరావు ఏలూరు కార్పొరేషన్‌లో టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్‌గా పని చేస్తూ ప్రమోషన్‌పై ఇక్కడకు టీపీవోగా వచ్చినట్టు కమిషనర్ తెలిపారు.



ఆగిపోయిన బస్సు

పెళ్లివారికి తప్పని తిప్పలు

కామవరపుకోట, మే 22(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు ఇటీవల గమ్య స్థానాలకు చేరకుండా ఎక్కడో ఒక చోట మొరాయించడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. గురువారం జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన ఒక పెళ్లి బృందం పెదవేగి మండలం కొండలరావుపాలెం గ్రామానికి జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన బస్సు మాట్లాడుకున్నారు. ఆ బస్సు కామవరపుకోట దాటాక వడ్లపల్లి అడ్డరోడ్డుకు రాగానే బస్సు మొరాయించింది. దీంతో పెళ్లి బృందం అసహనాన్ని వ్యక్తం చేశారు. బస్సుకు మరమ్మతుల అనంతరం పెళ్లి బృందం తరలివెళ్లింది.

27న జాబ్ మేళా

ఉంగుటూరు, మే 22(ఆంధ్రజ్యోతి) : యువత భవిష్యత్తుకు వారధిగా ఈ నెల 27న భీమడోలులో నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. భీమడోలులో జరిగే జాబ్ మేళా పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ జాబ్ మేళాలో 13 కంపెనీలు పాల్గొంటాయని జిల్లా స్కిల్ డెవెలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ అధికారి కె.ప్రవీణ్ వివరించారు. వివరాలకు (81848 87146, 77101 77767)నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయండి

జంగారెడ్డిగూడెం, మే 22(ఆంధ్రజ్యోతి) : ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేష ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. గురువారం ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి శేష ఏలూరు రోడ్డును పరిశీలించారు. గుంతలు త్వరగా పూడ్చాలని కోరారు. ఈ సందర్భంగా రోడ్డు వెడల్పులో భాగంగా పనుల్లో నాణ్యతను అధికారులతో కలిసి పరిశీలించారు.

టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక

కామవరపుకోట, మే 22(ఆంధ్రజ్యోతి) : కామవరపుకోట పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మాజీ సర్పంచ్, టీడీపీ నాయకులు ఘంటా సత్యంబాబు సమావేశాన్ని నిర్వహించి అధ్యక్షుడిగా ఖాన్ వజీర్‌ను, నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖాన్ వజీర్ గ్రామ కమిటీ అధ్యక్షునిగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. గురువారం జరిగిన సమావేశంలో పాత కమిటీనే తిరిగి నియమిస్తూ సత్యం బాబు ప్రకటించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

గర్భిణుల్లో అధిక రక్తపోటు అనర్థాలపై అవగాహన



ప్రచార పత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్

ఏలూరుఅర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): గర్భిణులకు ప్రీ-ఎక్లంప్సియా (అధిక రక్తపోటు)ఉంటే వైద్య నిపుణుల సలహాలు పాటించాలని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పేర్కొన్నారు. ప్రపంచ ప్రీ-ఎక్లంప్సియా వ్యాధి నివారణ దినాన్ని పురస్కరించుకుని ప్రచార పత్రాలను శుక్రవారం కలెక్టర్, వైద్యాధికారులు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రీ-ఎక్లంప్సియా వ్యాధి తల్లి, శిశువు ఇద్దరికీ ప్రమాదకరమని, దీనిమూలంగా మాతాశిశు మరణాలకు దారితీస్తుందన్నారు. అందుకే ఈ వ్యాధి గురించి ముందుగానే వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే మాతా, శిశు మరణాలు సంభవించకుండా కృషి చేయాలన్నారు. గతేడాది అక్టోబరు నుంచి ఈ ఏడాది మార్చి వరకు జిల్లాలో సంభవించిన 8మాతృ మరణాలు, 7 శిశు మరణాలకు సంబంధించిన నివేదికలను పరిశీలించారు. గర్భధారణ నాటి నుంచి ప్రసవం జరిగే వరకు ఆశ,ఆరోగ్య కార్యకర్త, హెల్త్ సూపర్ వైజర్లు వారికి అందుబాటులో ఉండాలన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీశ్, డీఎంహెచ్‌వో మాలిని, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ రాజీవ్, డీఐవో నాగేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ శారద పాల్గొన్నారు.

తాటిచెట్లు తొలగించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న బర్రేవారిగూడెం వాసులు

టి.నర్సాపురం, మే22 (ఆంధ్రజ్యోతి): తాము ఎంతో కాలంగా నడిచే రహదారిని కొందరూ వ్యక్తులు తమదని రోడ్డుకు అడ్డంగా తాడిచెట్లు, ముళ్లకంప వేసి రాకపోకలు నిలిపివేశారంటూ కేతవరం పంచాయతీలోని బర్రేవారిగూడెం గ్రామస్థులు గురువారం ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ బర్రేవారిగూడెంలో సుమారు 35కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు.గత నాలుగు రోజులుగా రోడ్డు మార్గం మూసివేయడంతో బయటకు వెళ్లేదారిలేక రాకపోకలు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారివెంట తాము సుమారు 40 సంవత్సరాల నుంచి రాకపోకలు సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయం పై పంచాయతీ కార్యదర్శిని శైలజను వివరణ కోరగా ఇప్పటికే ఉన్నతాధికారులకు తెలియజేశామని రోడ్డును సర్వే చేసి ఇరువర్గాలకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళన విరమించినట్టు ఆమె తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు సాయం అందజేస్తున్న దృశ్యం

పెదవేగి, మే 22(ఆంధ్రజ్యోతి) : పాఠశాల వసతి గృహంలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ప్రాణాపాయస్థితి నుంచి కోలుకున్న బాధిత బాలుడికి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చొరవతో వసతి గృహం నిర్వాహకులు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ప్రమాదం జరిగిననాటి నుంచి అండగా నిలిచి, ఆరోగ్యంగా ఇంటికి చేరేలా తోడ్పాటునందించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక గ్రామానికి చెందిన సుధీర్ ఏలూరులోని సెయింట్ గ్జేవియర్ పాఠశాల వసతి గృహంలో ఉంటూ అదే పాఠశాలలో చదువుతున్నాడు. గతేడాది జూలై 24వ తేదీ అర్ధరాత్రి తోటి విద్యార్థి చేసిన నిర్వాకంతో పెట్రోల్ మీదపడి సుధీర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ బాలునికి ఏలూరులో చికిత్స అందిస్తుండగా బాలుని పరామర్శించిన చింతమనేని ప్రభాకర్ అతని పరిస్థితి గమనించి, విజయవాడ తరలించి, మెరుగైన చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. దాదాపు రూ.15 లక్షల వరకు వ్యయం కాగా కొంతమేర ఎమ్మెల్యే అందించారు. ఆయన స్ఫూర్తితో మరికొంతమంది ఆర్థిక సాయం చేశారు. దీంతోపాటు గ్జేవియర్ వసతిగృహం నిర్వాహకులను మరో రూ.5 లక్షలు అందించాల్సిందిగా ప్రభాకర్ సూచించడంతో ఆ మొత్తాన్ని సమకూర్చారు. గురువారం ఉదయం పెదవేగి మండలం దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకట లక్ష్మమ్మ సమక్షంలో ఆ నగదును అందించారు. ఈ కార్యక్రమంలో గుడివాకలంక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న చంటి

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

ఏలూరు టూటౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి చెక్కులను 18 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే బడేటి చంటి చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఏలూరు ఆసెంబ్లీ నియోజకవర్గంలో 160 మంది లబ్ధిదారులకు రూ.2 కోట్లు ఆర్థిక సాయం చేశామన్నారు. కార్యక్రమంలో ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థ సారధి పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులపై ఎమ్మెల్యే సమీక్ష

ఉంగుటూరు, మే 22(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఉండాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం నిర్దేశించిన జారీ ప్రక్రియకు సంబంధించి గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా రేషన్ కార్డుల ప్రక్రియలో భాగంగా మార్పులు చేర్పులు గురించి చర్చించారు. సమావేశంలో ఆయా మండలాల అధికారులు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

కొల్లూరు విశ్వేశ్వరరావు విగ్రహం ఏర్పాటు

కొయ్యలగూడెం, మే 22(ఆంధ్రజ్యోతి) : కొయ్యలగూడెం పట్టణాభివృద్ధికి కొల్లూరు విశ్వేశ్వరరావు సేవలు మరువలేనివని ఎమ్మెల్యే చిర్రి బాలారాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ప్రభుత్వ ఆస్పత్రి స్థల దాత దివంగత కొల్లూరు విశ్వేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఈ విగ్రహావిష్కరణకు కృషి చేసిన సర్పంచ్ దంపతులు ముప్పిడి విజయకుమారి, చినబాబులను అభినందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాధ్యక్షుడు తోట రవి, గంగి రెడ్ల మేఘలాదేవి, తాడికొండ మురళీ, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన

రూ.55 లక్షలతో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శంకుస్థాపన చేశారు. పరింపూడి పంచాయతీలోని కన్నాపురం రోడ్డులో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

» నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఆందోళన

ఏలూరుటూటౌన్, మే22 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ నాయకులు సోమయ్య డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ స్కిల్డ్ వర్కర్లకు, అన్‌స్కిల్డ్ వర్కర్ల కంటే తక్కువ జీతాలిస్తూ అన్యాయం చేస్తున్నారన్నారు. 15సంవత్సరాలు సర్వీస్ ఉన్న కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.



భూసార పరీక్షలకు నమూనా సేకరిస్తున్న అధికారులు

భూసార పరీక్షలు చేయించుకోవాలి

లింగపాలెం, మే 22(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు పంట సీజన్‌కు ముందే భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కోటగిరి మురళీకృష్ణ అన్నారు. లింగపాలెంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల వల్ల భూమి స్వభావం తెలుసుకుని ఎరువులు వాడుకోవచ్చన్నారు. మండలంలో 1200 ఎకరాల్లో భూ పరీక్షలు చేసేలా టార్గెట్ పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 550 ఎకరాల్లో పరీక్షలు జరిపామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.



దండిపూడిలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

దండిపూడిలో గిరిజనుల నిరసన

బుట్టాయగూడెం, మే 22(ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాలని, ఐటీడీఏ కార్యాలయంలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ గురువారం దండిపూడి గ్రామంలో ఆదివాసీలు పీవైఎల్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు టి.బాబూరావు, ఈ.భూషణం మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీలు నేటికి అమలు కాలేదన్నారు. ఏజెన్సీలో గిరిజన చట్టాలను అమలుపర్చాలని, గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులు కోరుతున్న డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. నిరసనలో నాయకులు కోర్స వెంకటేశ్, బొందల శ్రీను, మిర్తివాడ వెంకటేశ్, మామిడి మురళి పాల్గొన్నారు.



చార్ట్‌ను చూపించి చదివిస్తున్న ఏసీడీపీవో రాజశేఖర్

అంగన్వాడీ కేంద్రాలను శుభ్రంగా ఉంచండి

దెందులూరు, మే 22(ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పెదపాడు ప్రాజెక్టు ఏసీడీపీవో రాజశేఖర్ అన్నారు. గురువారం దెందులూరు మండలం చల్లచింతలపూడిలోని 127వ అంగన్వాడీ కేంద్రాన్ని రాజశేఖర్ పరిశీలించారు.అక్షర బోర్డును చూపించి చిన్నారులను ప్రశ్నలు అడిగారు. చిన్నారులు సమాధానం చెప్పడంతో రాజశేఖర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పెరుగుగూడెం, రామారావుగూడెం గ్రామాల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట దెందులూరు అంగన్వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టమ్మ, అంగన్వాడీ సహాయకురాలు ఉన్నారు.

ఫొటోగ్రఫీ, వీడియో మిక్సింగ్‌పై ఉచిత శిక్షణ

పెదపాడు, మే 22(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత యువతీ యువకులకు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం.ఫణికిశోర్ తెలిపారు. 19-45 సంవత్సరాల మధ్య యువతీ యువకులు టెన్త్, ఆపైన విద్యార్హత గలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల వారు(99485 65256, 99485 65256, 90140 40780)నెంబర్లలో సంప్రదించాలని కోరారు. 30 రోజుల శిక్షణ కాలంలో ఉచిత వసతితో కూడిన భోజన సౌకర్యం ఉంటుందన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, మే 22(ఆంధ్రజ్యోతి): నూతన విద్యుత్ వైర్లను ఏర్పాటు చేసేందుకు ఈ నెల 23, 24 తేదీల్లో కైకలూరు మండలం వరహాపట్నం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్ర, శనివారాలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

వివాహితపై యువకుల వేధింపులు

ముదినేపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): బడ్డీ పెట్టుకుని జీవిస్తున్న అల్లూరుకు చెందిన ఓ వివాహితను వేధిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఇద్దరు యువకులపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం కొర్రగుంటపాలెంకు చెందిన నాగబాబు, మణి అనే ఆ యువకులు తరచూ బడ్డీ వద్దకు వెళ్లి ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. దీనిపై గ్రామ పెద్దలు మందలించినా యువకుల ప్రవర్తన మారకపోవటంతో బుధవారం రాత్రి ఆ మహిళ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.ఎస్.వీరభద్రరావు తెలిపారు.

పశువుల దాణా పంపిణీ



కలిదిండి, మే 22 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి అన్నారు. గురువారం కలిదిండి, కోరుకొల్లు పశువైద్యశాలల్లో సబ్సిడీ పశువుల దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతుల కోసం పోషక విలువలు గల దాణాను 50 శాతం రాయితీపై అందిస్తున్నా రన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెన్నంశెట్టి మురళీకృష్ణ, నీటి సంఘం అధ్యక్షులు మోహనరావు, వలవల రమేష్, సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ, పశువైద్యాధికారులు ప్రణేంద్ర, ప్రహర్ష తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ జిల్లాస్థాయి మినీ మహానాడులో ముదినేపల్లి నాయకులు

మినీ మహానాడుకు తరలిన నాయకులు

ముదినేపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి) : నూజివీడులో గురువారం జరిగిన జిల్లా స్థాయి తెలుగుదేశం పార్టీ మినీ మహానాడుకు ముదినేపల్లి మండలం నుంచి పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్ళారు. పార్టీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ తదితరుల నాయకత్వంలో మండలం నుంచి టీడీపీ తెలుగు యువత, తెలుగు రైతు నాయకులు తరలి వెళ్లి మినీమహానాడులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులును పార్టీ నాయకులు కలిసి సహకార సంఘాల ద్వారా రైతులకు మరిన్ని రుణ సదుపాయాలను కల్పించే విషయాన్ని మహానాడులో ప్రతిపాదించాలని కోరారు.

జై..జై ఆంజనేయ

వైభవంగా హనుమజ్జయంతి



చాట్రాయిలో శ్రీఅభయ ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు





పెదపుట్లపూడి ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజలు



మండవల్లిలో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ముదినేపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి సందర్భంగా ముదినేపల్లిలోని మారుతీ నగర్‌లో సువర్చలా సమేత భక్తాంజనేయ స్వామికి పంచామృత అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తోపాటు మండల టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, టీడీపీ నాయకులు చలసాని జగన్మోహన్‌రావు, బొర్రా చలమయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు తదితరులు పూజలు జరిపారు. అనంతరం ఆంజనేయస్వామి కల్యాణాన్ని తాతా వెంకట శ్రీ పవన్, ఆషా ప్రియాంక దంపతులు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు మాడుగుల పూర్ణ, వత్తుమిల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి : కలిదిండి అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సుమారు ఐదు వేల మందికి భారీ అన్నసమారాధన నిర్వహించారు. పెదలంక, పెదపుట్లపూడి గ్రామాల్లో ఆంజనేయస్వామి భారీ విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కలిదిండి : హనుమజ్జయంతి సందర్భంగా గురువారం కోరుకొల్లు బస్టాండ్ సెంటర్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి గుర్వాయిపాలెం అభయాంజనేయస్వామి ఆలయం వరకు హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలుత కోరుకొల్లు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ హనుమాన్ శోభయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. కూటమి నాయకులు చిట్టూరి రవీంద్ర, పేటేటి సత్యనారాయణ, వలవల రామారావు, మురళీకృష్ణ, పెరుమాళ్ల వెంకటేశ్వరరావు, నంబూరి బాండు రాజు, నల్లగోపుల చలపతిరావు, కొల్లి బాబ్జి, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

చాట్రాయి : చాట్రాయి అభయ ఆంజనేయస్వామి, సూరంపాలెం శ్రీవీరాంజనేయస్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. గుడిపాడు, పర్వతాపురం, ఆరుగొలనుపేట, ఉప్పరగూడెం తదితర హనుమాన్ ఆలయాల్లో హనుజ్జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. హనుమాన్ చాలీసాలు, ప్రత్యేక పూజలతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఆలయ కమిటీలు భారీ అన్నసమారాధనలు నిర్వహించారు.

కైకలూరు : కైకలూరు కొరుకొల్లు రోడ్డులోని సువర్చలా సహిత దాసాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, తమలపాకులతో పూజలు చేశారు. కలిదిండి బస్టాండ్ సెంటర్, రైల్వే గేటు అవతల, మెయిన్‌రోడ్డు, బైపాస్ రోడ్డు, ఆటపాక, గోనెపాడు, భుజబలపట్నం, గోపవరం తదితర గ్రామాల్లో ఆంజనేయ స్వామికి అప్పాలు, పానకం, వడపప్పు నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు.ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వింజరంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రత్యేకపూజలను నిర్వహించి హనుమాన్ శోభాయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. వింజరం నుంచి కైకలూరు మార్కెట్ యార్డు మీదుగా ఆటపాకలోని ఆంజనేయ స్వామి ఆలయం వరకు ఈ ర్యాలీని చేపట్టారు. వేలాది మంది భక్తులు తరలిరావడంతో రహదారులు కిక్కిరిసి పోయాయి. శ్రీమన్నారాయణగోష్టి మహిళలు పాద యాత్రగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

మండవల్లి : మండవల్లిలోని మంచినీటి చెరువు గట్టు వద్ద అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి హనుమాన్ శోభాయాత్రను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. అంతకు ముందు మండలంలోని లింగాల, కానుకొల్లు, అప్పాపురం, అయ్యవారి రుద్రవరం, భైరవపట్నం, చావలిపాడు, లోకుమూడి, ఇంగిలిపాకలంక, చింతపాడు గ్రామాల్లో స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మండవల్లి హైస్కూల్ సెంటర్‌లోని ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద మహిళలు, చిన్నపిల్లలు వేరువేరుగా నిర్వహించిన కోలాటం ఆకట్టుకున్నది. అనంతరం ఆయా గ్రామాల్లో నిర్వహించిన భారీ అన్న సమారాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.



ఉప్పరగూడెంలో వీరాంజనేయస్వామికి పూజలు



కైకలూరులో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



కోరుకొల్లులో నిర్వహిస్తున్న హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ

శ్రీవారి గోవుల దత్తత

- ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహం
- రైతులకు 7 వేల పైబడి గోవుల దత్తత
- దేవస్థానం ఇచ్చిన ఆవులను పెంచి పోషిస్తున్న రైతులు




ద్వారకాతిరుమల, మే 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి శేషాచలంపై ఉన్న గోసంరక్షణ శాలలోని కొన్ని రకాల గోవులను రైతులకు దత్తతనిస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని దేవస్థానం ప్రోత్సహిస్తోంది. మొక్కుబడుల రూపేణా దాతలు సమర్పించే గోవుల సంఖ్య పెరుగుతుండటంతో దేవస్థానం 1987లో కొండపై గోశాలను ప్రారంభించారు. 2007లో దానిని గోసంరక్షణ ట్రస్టుగా రూపొం దించారు. అదే ఏడాది గోదత్తత కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీవారి మొక్కుబడులు సమర్పించే దిశగా పలువురు భక్తులు గోవులను అందిస్తుంటారు. ఈ క్రమంలో గోసంతతి పెరిగింది. ఇందులో గోవుల నుంచి వచ్చే పాలను ప్రధాన దేవాలయంతో పాటు ఉప, దత్తత దేవాలయాల్లో స్వామివారి సేవలతో పాటు, ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదానంలోను, ప్రసాదంలోను వినియోగిస్తారు. పాలివ్వని, చూడికట్టని గోవులు పెరుగు తుండటంతో దేవస్థానం ఓ ఆలోచన చేసింది. ఇటీవల కాలంలో ప్రకృతి వ్యవసాయం పెరిగింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించి రసాయనిక ఎరువులకు చెక్‌పెట్టే విధంగా ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రకృతి సేద్యంను ప్రోత్సహిస్తుండటంతో రైతులు ఆ వైపు దృష్టి సారిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో ముఖ్యంగా గోఆధారిత పదార్థాలను వినియోగించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా గోమూత్రం, ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో గోశాలలో పాలివ్వని, చూడికట్టని ఆవులను ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అందజేస్తే వాటికి పోషణ అందడంతో పాటు ఇటు రైతు పొలానికి అవసరమయ్యే ఎరువు లభ్యమవుతుందన్న ఆలోచన చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని శేషాచలంపై ఉన్న శ్రీవారి గోసంరక్షణ శాలలో ఉన్న కొన్ని జాతుల గోవులను, గిత్తలను ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులకు దత్తతనిచ్చే కార్యక్రమం తలపెట్టింది. ఇప్పటి వరకూ దేవస్థానం వివిధ ప్రాంతాలకు చెందిన రైతులకు 7,342 వరకూ గోవులను దత్తతకు ఇచ్చింది.

రెండు, నాల్గవ శనివారం దత్తత

చినవెంకన్న గోసంరక్షణ శాలలో ప్రస్తుతం 343 వరకూ వివిధ జాతుల గోవులు, గిత్తలు ఉన్నాయి. ఇందులో పుంగనూరు, కపిల, కాంక్రీట్, గిర్, ఒంగోలు, నిమారి, మైసూర్ జాతుల మినహా దేశవాళీ, జెర్సీ జాతులను రైతులకు దత్తత ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. ప్రతీ నెలలో రెండు, నాల్గవ శనివారం ఇటువంటి గోవులను దత్తత ఇచ్చే కార్యక్రమం తలపెట్టినట్లు పేర్కొన్నారు. ఈనెల 24న ప్రస్తుతం దత్తతకు ఇచ్చే రకానికి చెందిన గోవులు 40 వరకూ ఉన్నట్లు చెప్పారు.

గోదత్తత స్వీకారానికి అర్హతలివే

దేశంలో లంప్‌స్కిన్ వ్యాధి రావడంతో గోవులను దత్తత ఇచ్చే కార్యక్రమాన్ని కొన్నాళ్లుగా నిలిపి వేశారు. ఇటీవల గోఆధారిత వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే ఇచ్చేలా నిర్ణయించారు. ఇందు నిమిత్తం రైతులు తమ పొలానికి సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలు, 100 రూపాయల స్టాంప్ పేపర్, ఆధార్‌కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం జిరాక్స్, తమ కాంటాక్ట్ నంబర్లతో ఆలయ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.ఇలా నమోదు చేసుకున్న వారికే గోదత్తత ఇస్తామన్నారు. వాటిని రైతులు పెంచి పోషించాలే గానీ విక్రయించకూడదు. దత్తత తీసుకున్న రైతులు ఆవులను సంరక్షిస్తూ వాటి ద్వారా వచ్చే గోమూత్రం, పేడ తదితరాలతో ప్రకృతి వ్యవసాయం చేసి నాణ్యమైన ఉత్పత్తులను అందించాలని అధికారులు చెబుతున్నారు. ప్రతీ మూడు నెలలకి ఓసారి వాటి పరిస్థితి ఎలా ఉంది అన్న అంశంపై వాట్సాప్ ద్వారా దత్తత తీసుకున్న రైతు నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారు.



ఇదో మహత్తర కార్యక్రమం

ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి, ఈవో, ద్వారకాతిరుమల

స్వామివారి దేవస్థానంలో ఇదో మహత్తర కార్యక్రమం. గోశాలలో ఉన్న గోవుల్లో పాలివ్వనివి చూడికట్టని వాటిని ఎలా వినియోగించాలి అన్న ఆలోచనే ఈ గోదత్తత కార్యక్రమం. ఇది రైతులకు వరం. గోశాలలో ఉన్న సి గ్రేడ్ ఆవులు రైతుల సేద్యానికి ఉపయోగపడుతున్నాయి. ఎందరో రైతులు వాటిని సాకుతూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. అలాగే కొందరు గోమాతలను పెంచి పోషిస్తూ ఆనందాన్ని పొందుతున్నారు.



దైవ దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న టాటా మ్యాజిక్
- పది మందికి గాయాలు..
- రాజానగరం వద్ద ఘటన
- క్షతగాత్రుల స్వగ్రామం ఏలూరు జిల్లా చెక్కపల్లి

రాజానగరం, మే 22 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రమైన అన్నవరం దైవదర్శనానికి వెళ్తుండగా మార్గమధ్యలో రాజానగరం సమీపంలో హైవేపై ఆగి ఉన్న లారీని, టాటా మ్యాజిక్ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన పది మంది గాయపడ్డారు. బుధవారం అర్ధరాత్రి దాటాక ఒంటిగంట సమయంలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన నాగుల వెంకటేశ్వరరావు, నాగుల రాజ్యలక్ష్మి, బి.రఘుబాబు, బి.లక్ష్మీదుర్గ, తాళం రాధ, బి.దేవిక, బి.లోకేశ్వరరావు, బి.దేవేంద్ర, ఎన్.పావని ఒకే కుటుంబానికి చెందిన బంధువులు. వీరంతా టాటా మ్యాజిక్ వ్యాన్‌లో అన్నవరం సత్యదేవుని దర్శనానికి బయలుదేరారు. మార్గమధ్యలో రాజానగరం సమీపానికి వచ్చే సరికి హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వ్యాన్‌లో ప్రయాణిస్తున్నవారంతా గాయపడ్డారు. డ్రైవర్ చింతలచెరువు మధుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ వాహనంలో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించినట్టు రాజానగరం పోలీసులు తెలిపారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు నిర్ధారించినట్టు ఎస్ఐ నాగార్జున చెప్పారు. వ్యాన్ డ్రైవర్ రెప్పపాటు కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.



క్షతగాత్రులను 108 వాహనంలోకి ఎక్కిస్తున్న దృశ్యం

మర్లపాలెం-సోమవరం రహదారికి మోక్షం

చాట్రాయి, మే 22(ఆంధ్రజ్యోతి) : పూర్తిగా శిథిలమై కనీసం ద్విచక్రవాహనాలు కూడా నడవటానికి అవకాశం లేకుండా ఉన్న మర్లపాలెం-సోమవరం గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రహదారికి ఎట్టకేలకు మోక్షం కలుగుతున్నది. రమణక్కపేట-పోలవరం ఆర్అండ్‌బీ రహదారి (ఆర్‌పీ రోడ్డు) పరిధిలో ఉన్న ఈ 5 కిలోమీటర్ల రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనచోదకులు నరకయాతన పడుతున్నారు. పోలవరం, మర్లపాలెం, టీ.గుడిపాడు తదితర గ్రామాల ప్రజలు నూజివీడు, విజయవాడ మొదలైన పట్టణాలకు ఈ మార్గంలోనే వెళతారు. సోమవరం, జగన్నాధపురం, కొత్తగూడెం, యర్రావారిగూడెం ప్రజలు ఈ రోడ్డు నుంచి నిత్యం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తారు. కొన్ని నెలల కింద టెండర్లు జరిగినా పనులు ప్రారంభంలో తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు పనులు ప్రారంభం కావటంతో గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు పనులు ప్రారంభించిన దృశ్యం



ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

సూరంపాలెంలో ఆలయ ముఖద్వారం ప్రారంభం

చాట్రాయి, మే 22(ఆంధ్రజ్యోతి): విజయవాడ- సత్తుపల్లి రహదారి పక్కన రూ.22 లక్షలు భక్తుల విరాళాలతో నిర్మించిన వీరాంజనేయ స్వామి ఆలయ ముఖద్వారాన్ని గురువారం ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు, గ్రామ ప్రముఖులు శాస్త్రోక్తంగా పూజలు చేసి ప్రారంభించారు. ఉదయం 9 గంటలకు మంత్రి పార్థసారథి ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభించవలసి ఉండగా, పెద్ద సంఖ్యలో భక్తులు, కూటమి శ్రేణులు ఇక్కడకు చేరుకొని కొన్ని గంటలపాటు మంత్రి కోసం నిరీక్షించారు. మధ్యాహ్నం మంత్రి పర్యటన రద్దు అయినట్లు సమాచారం రావడంతో కమిటీ సభ్యులు ముఖద్వారాన్ని ప్రారంభించారు.

పిడుగు పడి విద్యుత్ పరికరాలు ధ్వంసం



ధ్వంసమైన ఇల్లు, విద్యుత్ పరికరాలు

ముదినేపల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): భారీ వర్షం, ఉరుములు మెరుపుల మధ్య బుధవారం రాత్రి ముదినేపల్లి మండలం ములకలపల్లి గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు బొప్పన సుందర రామయ్య ఇంటితోపాటు పలు గృహాలపై పడిన పిడుగు పాటుకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ సంఘటనలో భవనం పాక్షికంగా దెబ్బతినగా, భవనంలోని టీవీ, ఆరు ఫ్యాన్లు, ఏసీ, వాటర్ ప్యూరిఫైర్, ఇన్వర్టర్‌తోపాటు ఇతరుల ఇళ్లల్లోకి విద్యుత్ పరకరాలు కాలిపోయాయి. సుమారు రూ.3 లక్షల విలువైన పరికరాలు దగ్ధమయ్యాయని సుందర రామ య్య తెలిపారు. పిడుగుపాటుకు ఆయన, కుటుంబ సభ్యులు బెంబేలెత్తిపోయి బయటికి పరుగులెత్తారు. పిడుగుల శబ్దాలకు సరిహద్దు కుటుంబాల వారు కూడా ఇళ్ల నుంచి బయటకు వచ్చేశారు. ఈ భవనంపై రెండు చోట్ల పిడుగులుపడ్డాయి. గంటా నాగేశ్వరరావు, ప్రసాద్, దాసరి కృష్ణమూర్తి, ఫ్రాన్సిస్, కొనరాజు నాగేశ్వరరావు ఇళ్లల్లోని ఏసీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు ధ్వంసమయ్యాయి. పిడుగుల వల్ల కలిగిన నష్టాన్ని వీఆర్వో శ్రీరాములు నమోదు చేశారు.

అభయాంజనేయస్వామికి పూజలు

పెదపాడు, మే 22(ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం అప్పనవీడు అభయాంజనేయస్వామి 24వ హనుమజ్జయంతి వేడుకలు ముగింపు సంద ర్భంగా ఉదయం స్వామివారికి పంచామృ తాలతో అభిషేకం చేశారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, బడేటి చంటి, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీలు స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామోత్సవం అనంతరం స్వామివారి 25, 18 కేజీల లడ్డూ వేలంపాట నిర్వహించారు. నాయుడుగూడెం సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే చింతమనేని భార్య రాధారాణి పూజలు నిర్వహించారు.



అభయాంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే బడేటి చంటి, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475